
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 నంద్యాల జిల్లా వార్తలు
బుధవారం 18 డిసెంబరు 2024



కోసిగి సంతలో ఓ పొట్టేలు భారీ ధరకు అమ్ముడపోయింది. వందల సంఖ్యలో వచ్చిన పొట్టేళ్లలో ఆ ఒక్కటే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ పొట్టేలు ధర ఎంతో తెలియాలంటే ముందుగా దేవర కథ తెలియాలి.



దేవర ధర
రూ. 1.28 లక్షలు



కోసిగి సంతలోనే తలపడుతున్న పొట్టేళ్లు

కోసిగి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలోని వందగల్లు గ్రామానికి చెందిన వెంకటేశ్ ఓ పొట్టేలుకు దేవర అనే పేరు పెట్టి పెంచాడు. మంగళవారం కోసిగిలో జరిగిన సంతలో దేవరను విక్రయించేందుకు తీసుకువచ్చాడు. దేవరను పెద్దకడుబూరు మండలం బాపులదొడ్డి గ్రామానికి చెందిన ఓ రైతు రూ.1.28 లక్షలకు తమ ఊరిలో జరిగే జాతర కోసం కొనుగోలు చేశాడు. ఇప్పటి వరకు కోసిగి మార్కెట్‌లో అత్యధిక ధరకు అమ్ముడైన పొట్టేలు ఇదే కావడం రికార్డ్. కోసిగితో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడుబూరు, పత్తికొండ, ఆలూరు, తదితర ప్రాంతాల నుంచి గొర్రెల వ్యాపారులు, రైతులు పెద్ద ఎత్తున కోసిగి సంతకు గొర్రెలను తెచ్చారు. పొట్టేళ్లను కొనుగోలు చేయడానికి వ్యాపారులు, రైతులు పోటీ పడ్డారు. రూ.20 వేలు మొదలుకొని రూ.లక్షకు పైగా ధర పలికాయి. మంగళవారం ఒక్కరోజే ఈ సంతలో రూ.కోటికి పైగా వ్యాపారాలు జరగడం విశేషం.



కోసిగిలో రేణుకా ఎల్లమ్మ ఆలయ మైదానంలో జరిగిన గొర్రెల సంతకు వచ్చిన జనం

నాలుగు బైకులు గెలిచిన పొట్టేలు

నేను కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోట నుంచి రూ.లక్షకు పైగా పెట్టి పొట్టేలును కొనుగోలు చేశాను. ఇప్పటి వరకు పందెం పోటీల్లో నాలుగు బైకులు గెలుచుకుంది. మంగళవారం కోసిగి సంతలో పొట్టేలు రూ.1.28 లక్షలకు కొనుగోలు చేశారు. ఇదే అత్యధికంగా పలికిన ధర. దేవర నా నుంచి దూరం అవుతున్నందుకు కాస్త బాధగానే ఉంది.

\- వందగల్లు వెంకటేశ్



వైసీపీ ప్రభుత్వ తీరుతో బనగానపల్లె లోని నాపరాయి పరిశ్రమ కుదేలైంది. పాత పద్ధతిని తీసుకువచ్చి మళ్లీ నాప రాయి పరిశ్రమకు అండగా ఉంటాం' ఈ ఏడాది మార్చి 29న బనగానప ల్లెలో ఎన్నికల సందర్భంగా నిర్వహిం చిన సభలో అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు నాయుడు చెప్పిన మాట.

"బనగానపల్లె నియోజకవర్గంలో నాపరాయి పరిశ్రమలు ఎక్కువ. వైసీపీ ప్రభుత్వం తీరుతో ఈ పరిశ్రమ నాశన మైంది. వైసీపీ విధానాలను తీసేసి, పాత పద్ధతిని తీసుకువస్తాం. కుటీర పరిశ్ర మగా మారుస్తాం. నాపరాయి పరిశ్రమ యజమానులు, కార్మికులను ఆదు కుంటా' 2023 మే నెలలో బనగాన పల్లె నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర సందర్భంగా అప్పటి టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇచ్చిన హామీ.



బతుకుపై బండరాయి



- గనుల యజమానులపై కన్సిడరేషన్ ఫీజు
- వైసీపీ తెచ్చిన జీఓను రద్దు చేయని కూటమి ప్రభుత్వం
- లక్షల రూపా యల వసూలుకు సిద్ధ మైన మైనింగ్ శాఖ
- బనగానపల్లె నియోజకవర్గంలో నాప రాయి పరిశ్రమ కుదేలు
- నిద్ర నటిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

నంద్యాల, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి)/బనగానపల్లె: ఎన్నికలకు ముందు టీడీపీ నాయకులు ఈ స్థాయిలో హామీలివ్వ టంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తమ బతుకు మారుతుం దని బనగానపల్లె నియోజకవర్గ నాపరాయి పరి శ్రమ యజమా నులు సంబరప డ్డారు. ఇక తమ నియోజకవర్గానికి చెందిన బీసీ జనార్ద న్‌రెడ్డి మంత్రి కూడా కావటంతో ఇక తమకు ఎలాంటి చింత లేదని భావించారు. కానీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, నాప రాయి పరిశ్రమ నడ్డి విరిచేందుకు సిద్ధమైంది. కన్సి డరేషన్ ఫీజు పేరిట నాలుగేళ్ల వైసీపీ జీఓను చూపించి లక్షల రూపాయల వసూ లుకు సిద్ధమైంది. సడీ చప్పుడు లేకుండా రాత్రికి రాత్రి లక్షల రూపాయలు కట్టాలని ఆన్‌లైన్‌లో చూపుతుండటంతో పరిశ్రమ యజమానులు గగ్గోలు పెడుతున్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రె డ్డి ఉండి కూడా తమ గురించి పట్టించుకోకపో వటం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. తమకు కన్సిడరేషన్ ఫీజు నుంచి మిన హాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నంద్యాల, అనంతపురం సరిహద్దులోని బందా ర్లపల్లె చెక్‌పోస్టు వద్ద లోడ్‌తో ఉన్న వందకు పైగా ట్రాక్టర్లతో మైనింగ్ యజమానులు, కార్మి కులు రోడ్డును నిర్బంధించారు. వారి గోడును పట్టించుకొని కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందా? లేదా? అన్నది వేచి చూడాలి.



గత ప్రభుత్వంలో..

నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గ కేంద్రం లోని పలుకూరు, రామకృష్ణాపురం, అవుకు మండలంలోని చెర్లో పల్లె, రామాపురం, సుంకేసుల, కొలిమిగుండ్ల మండలంలో బెలుం, బెలుం శింగవరం, మీర్జాపురం, ఇటిక్యాల, కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె, గొర్విమానుపల్లె, తుమ్మలపెంట, బందార్లపల్లె, చింతలాయపల్లె తదితర గ్రామాల్లో నాపరాయి గనులు ఉన్నాయి. ఒకప్పుడు ఈ పరిశ్రమల వల్ల వేలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం తీరుతో ఈ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడింది. వైసీపీ ప్రభుత్వం రాక ముందు డెడ్‌రెంటు హెక్టారుకు రూ.52 వేలు ఉండేది. ఈ మొత్తం రీ ఫండ్ కూడా ఉండేది. దానిని పది రెట్లకు అంటే రూ.5.20 లక్షలకు పెంచింది. ఈ డెడ్ రెంటు రాయల్టీ బిల్లుల్లో సరిపుచ్చడానికి అవకాశం ఉండేది. లీజు విధానాన్ని రద్దు చేసి వేలం పాట ద్వారా పొందాలని ఆదేశాలు జారీ చేసింది. సెక్యూ రిటీ డిపాజిట్ హెక్టారుకు గతంలో రూ.52 వేలు ఉన్న దాన్ని మూడు రెట్లు పెంచారు. అంతేగాకుండా పెద్ద పెద్ద పరిశ్రమలకు అవసర మయ్యే మైనింగ్ ప్లాన్, పర్యావరణ అనుమతుల క్లియరెన్స్ నిబంధనలను నాపరాయి వంటి చిన్న పరిశ్రమకు ఆపా దించారు. దీంతో జిల్లాలోని చాలా పరిశ్రమలను నడుపుకోలేక నానా ఇబ్బందులు పడ్డారు.

అప్పుడేమో అలా చెప్పి..

గత వైసీపీ ప్రభుత్వం ఆయా రంగా లను అభివృద్ధి వైపు నడిపించక పోగా, వాటిని నాశనం చేసే నిర్ణ యాలు తీసుకున్నారు. అలాం టిదే మైనింగ్ శాఖకు సంబంధించిన కన్సిడరేష న్ ఫీజు. కొవిడ్ సమయంలో ఆదాయం పూర్తిగా దెబ్బతినటంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం మైనింగ్ శాఖ పరిధిలోకి వచ్చే ఖనిజాల తవ్వకాలపై రాయల్టీకి సమానమైన కన్సిడరేషన్ ఫీజు యజమానులు కట్టాలంటూ 2021లో జీఓ తీసుకువచ్చింది. దీని ప్రకారం రాయల్టీ రూ.100 ఉంటే, కన్సిడరేషన్ ఫీజును వంద శాతం అదనంగా వేశారు.



నిలిచిపోయిన వాహనాలు

అంటే రాయల్టీ రూ.100 కడితే, కన్సిడరేషన్ ఫీజు రూపంలో మరో రూ.100 వెరసి రూ.200 కట్టాలి. అంటే ఎపుడూ కట్టే దానికంటే అద నంగా మరో రూ.100 కట్టాలన్నమాట. గ్రానైట్‌కు మాత్రం ఇందులో 50 శాతం మాత్రమే వసూలు చేశారు. అయితే నాపరాయి పరిశ్రమపై కూడా వంద శాతం కన్సిడరేషన్ ఫీజు కట్టాలంటూ అప్పటి వైసీపీ ప్రభుత్వం చెప్పింది. అయితే దీనిపై వ్యతిరేకత రావ టంతో ఈ కన్సిడరేషన్ ఫీజును వసూలు చేయలేదు. అయితే ఇలా వసూలు చేయటం అన్యాయమని భావించిన కూటమి ప్రభుత్వం ఈ కన్సిడరేషన్ ఫీజును తొలగించాలని ఇటీవల భావించింది. అయితే ఏమయిందో ఏమో గానీ హఠాత్తుగా కన్సిడరేషన్ ఫీజు కట్టా లంటూ నాపరాయి పరిశ్రమల యజమానులకు ఆన్‌లైన్‌లో చూపి స్తోంది. ఒక్కొక్కరికి రూ.లక్షల్లో ఈ కన్సిడరేషన్ ఫీజు కట్టాలని వస్తుండటంతో వీరంతా లబోదిబోమంటున్నారు. ఇన్నేసి లక్షలు ఎలా కట్టాలని అడిగితే చెల్లించాల్సిందేనన్న సమాధానాలు మైనింగ్ శాఖ అధికారుల నుంచి వినిపిస్తున్నాయి.

వైసీపీ వల్ల రాష్ట్ర అధోగతి పాలైందంటూనే..

నంద్యాల జిల్లా వ్యాప్తంగా దాదాపు 500 వరకు వివిధ మైనింగ్ పరి శ్రమలు ఉన్నాయి. నాపరాయి పరిశ్రమలు 200 వరకు ఉన్నాయి. వీటిలో 50 పరిశ్రమలకు మాత్రమే అనుమతులు ఉండగా, మిగిలిన 150 పరిశ్రమలు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. అనుమతులు ఉన్న పరిశ్రమల్లో కూడా 40కి సంబంధించిన యజమా నులు మాత్రమే నాపరాయి వ్యాపారం చేస్తున్నారు. వీరంతా ఆయా పరిశ్రమల నుంచి తవ్వి తీసిన నాపరాయిని ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. దీని కోసం ఆన్‌లైన్‌లో రవాణా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో మొన్నటి వరకు సాఫీగా వచ్చిన అనమతులు, సోమవారం నుంచి కన్సిడరేషన్ ఫీజు రూ.లక్షల్లో పెండింగ్ ఉన్నట్లు చూపుతోంది. ఒకరికి రూ.18 లక్షల మేర ఫీజు చూపుతుం డగా, మరొకరికి రూ.28 లక్షలు, మరొకరికి రూ.60 లక్షలు చూపుతోంది. ఇదేమి టని వారు ఆరా తీయగా 2021లో అప్పటి ప్రభుత్వం జీఓ తీసుకువచ్చిన నాటి నుంచి కన్సిడరేషన్ ఫీజు పెండింగ్‌లో ఉందని, అదిపుడు లక్షల రూపాయలకు చేరుకుందని తెలుసుకు న్నారు. గత ప్రభుత్వ విధానాలు బాగాలేవని, అందువల్లే రాష్ట్రం అధోగతి పాలైం దని పదే పదే మొత్తుకునే సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి నాయ కులు తెగ విమర్శలు చేస్తుంటారు. అలాంటిది ఇప్పుడు అప్పట్లో వైసీపీ తీసుకువచ్చిన జీఓ ప్రకారం ఇపుడు కన్సిడరేషన్ ఫీజు ఎందుకు వసూలు చేస్తున్నారన్న నాపరాయి పరిశ్రమ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కన్సిడరేషన్ ఫీజును కూటమి ప్రభుత్వమే వ సూలు చేయాలని చెప్పిందా లేక మైనింగ్ శాఖ అత్యుత్సాహం చూపించి వసూలుకు సిద్ధమైందా? అనే అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ప్రభుత్వ ఆదేశాలు లేకుండా ఏ శాఖ కూడా ఇలాంటి పని చేయదని, కూటమి ప్రభుత్వం చెప్పడంతోనే నాలుగేళ్ల నాటి కన్సిడరేషన్ ఫీజును మైనింగ్ శాఖ వసూలు చేసేందుకు సమాయత్తమైందన్న అభిప్రాయం వినిపిస్తోంది.


తీవ్ర నష్టాలు



నాపరాయి పరిశ్రమ తీవ్ర నష్టాల్లో ఉంది. కొత్త కొత్త నిబంధనలు తీసుకువచ్చి, లీజుదారులపై లక్షలాది రూపాయలు బరువు మోపితే చెల్లించే పరిస్థితిలో లేము. దయచేసి ప్రభుత్వం పాత విధానాన్ని కొనసాగించాలి.

\- సుదర్శనరెడ్డి లీజుహోల్డర్, అంకిరెడ్డిపల్లె

అదనపు భారం



రాయల్టీ ధరకు 100శాతం అదనంగా కన్సిడరేషన్ మొత్తాన్ని పెంచడం అత్యంత బాధాకరం. ప్రభుత్వం దీన్ని వెంటనే ఉపసంహరించుకొని, నాపరాయి పరిశ్రమను ఆదుకోవాలి.

\-శివశంకర్, కనకాద్రిపల్లె

మంత్రి ఉండి దండగ..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాప రాయి పరిశ్రమ యజమానులు ఇక్కట్లు పడ్డా రంటూ అప్పటి టీడీపీ నేత బీసీ జనార్దన్‌రెడ్డి పలు విమర్శలు చేసేవారు. వారితో కలిసి అప్పటి వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు కూడా నిర్వహించారు. తనను గెలి పిస్తే నాపరాయి పరిశ్రమను అన్ని విధాలుగా ఆదుకుంటామని పదే పదే చెప్పేవారు. ఆయన మాటలు నమ్మి నియోజకవర్గ ప్రజలు ముఖ్యంగా కొలిమిగుండ్ల ప్రజలు ఓట్లు వేశారు. కొలిమిగుండ్లలో 2019 ఎన్నికల్లో వైసీపీ దాదాపు 6 వేలకు పైగా మెజారిటీని కట్టబెట్టిన ప్రజలు, మొన్నటి ఎన్నికల్లో దానిని పూర్తిగా తగ్గించి 2800 ఓట్ల మెజారిటీని బీసీకి కట్టబెట్టారు. భారీ మెజారిటీతో గెలిచిన బీసీ మంత్రి కూడా అయ్యారు. కూటమి ప్రభు త్వంలో ముఖ్య పాత్ర వహిస్తూ, సీఎం చంద్ర బాబు నాయుడికి సన్నిహితుడిగా పేరు తెచ్చు కున్న మంత్రి బీసీ మాత్రం నాపరాయి పరిశ్ర మను పట్టించుకోవటం మానేశారు. అంతేకా కుండా గత ప్రభుత్వంలోని కఠినమైన నిబంధ నలను ప్రస్తుత కూటమి అమలు చేస్తున్నా, వాటి వల్ల ఇక్కడి నాపరాయి పరిశ్రమ నలిగి పోతున్నా, కనీసం ఈ విషయాన్ని సీఎం చంద్రబాబుకు బీసీ తెలియజేయటం లేదన్న విమర్శలు చెలరేగుతున్నాయి.

డీసీ అధ్యక్షులు ఏకగ్రీవం

- సాగునీటి ఎన్నికల్లో రెండో ఘట్టం ప్రశాంతం
- 21న ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ఎన్నిక



చాగలమర్రి మండలం టీజీపీ డీఈ నుంచి డిక్లరేషన్ పత్రాన్ని అందుకుంటున్న టీజీపీ డిస్ట్రిబ్యూటరీ చైర్‌పర్సన్ శబ్జారెడ్డి

నంద్యాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) ఎన్నికలు పూర్తిగా కూటమి మద్దతుదారుల వశమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు కొలువుదీరారు. జలవనరుల శాఖ అధికారుల పర్యవేక్షణలో డీసీల ఎన్నిక ప్రక్రియ మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైంది. సాగునీటి సంఘాల ఎన్నికల్లో రెండో ఘట్టం డీసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడం తో జిల్లా ఇరిగేషన్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. చివరి ఘట్టంలో కీలకమైన ప్రాజెక్టు కమిటీ (పీసీ) చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ నెల 21 పీసీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక కోసం జలవనరుల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఈ నెల 14న సాగు నీటి సంఘాలకు ఎన్నికలు జరగ్గా, వాటిలో హవా చూపించినట్లే డీసీ ఎన్నికల్లోనూ కూటమి మద్దతుదారులు అన్నింటిని కైవసం చేసుకు న్నారు. ఈ ఎన్నికలను అధికారులు ప్రశాంతంగా నిర్వహించారు. డీసీలకు సంబంధించి కేసీ కాలువ కింద 9, తెలుగుగంగ కింద 8, ఎస్సార్బీసీ పరిధిలో 8 ఉన్నాయి. వీటిలో కేసీ కాలువకు సంబంధించి మురవకొండ, ముచ్చుమర్రి, వేల్పనూరు 2, 3, నంద్యాల గోస్పాడు, 5, 6 ఆళ్లగడ్డ 7, 8, పెద్దముడియం 9 డీసీలు ఉన్నాయి. అలాగే ఎస్సార్బీసీ పోలూరు, మద్దూరు, నందవరం, బనగానపల్లె, గులదుర్తి, గుండ్ల సింగవరం, అల్వకొండ, మాయలూరు డీసీలు ఉన్నాయి. తెలుగు గంగ కింద 8 డీసీలు ఉన్నాయి. వీటిలో ఎక్కడ కూడా వైసీపీ నుంచి పోటీదారులు లేకపోవటంతో కూటమి ప్రభుత్వ మద్దతు దారులకు ఎదురు లేకుండా పోయింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు పూనుకుంది. ఎపుడైతే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందో ఆయా సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎదురు ఉండదన్న అభిప్రాయం వ్యక్తమైంది. అనుకున్నట్లుగానే మొన్న జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తిగా వన్‌సైడ్ అయిపోయాయి. ఆ ఫలితాలను బట్టి డీసీ ఎన్నికలు కూడా కూటమి ప్రభుత్వ మద్దతుదారులకు దక్కుతాయని తేలిపోయింది.

ఇంధన వ్యయ నియంత్రణ పాటించాలి

నంద్యాల రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఇంధన వ్యయ నియంత్రణ పాటించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్ కుమార్ కోరారు. మంగళవారం పట్టణంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవ ర్యాలీ చేపట్టారు. విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ విద్యుత్ కార్యాలయం నుంచి శ్రీనివాససెంటర్ మీదుగా గాంధీచౌక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్ఈ సుధాకర్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో పురోగతి సాధిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసులరెడ్డి, డీఈఈలు రమేష్‌కుమార్, సుబ్రమణ్యం, ఏఈలు రామయ్య, రవికుమార్, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ పరీక్షలు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ఈ నెల 23 వరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించు డిపార్ట్‌మెంట్ పరీక్షలు, పాణ్యం రాజీవ్‌గాంధీ మెమోరియల్ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్షన్ అధికారి, లైజన్ ఆఫీసర్, పరీక్ష నిర్వహణ చీఫ్ సూపరిండెంట్, పోలీసు శాఖ, ఏపీఎస్‌పీడీసీఎల్, డీఎంహెచ్‌వో తదితర అధికారులతో కోఆర్డినేటింగ్ సమావేశం మంగళవారం నిర్వహించారు. పరీక్ష నిర్వహణకై సూచనలు ఇచ్చియున్నారు. పరీక్షకు హాజరుగు వారు ఉదయం 9గంటలలోపుగా, మధ్యాహ్నం 2గంటలలోపుగా పరీక్షా కేంద్రం నందు హాజరుకావలెను అని జిల్లా రెవెన్యూ అధికారి తెలిపారు..

ఓర్వకల్లు జాతీయ రహదారిపై
ఆటోను ఢీకొన్న లారీ
డ్రైవర్ సహా ఐదుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు

7లో

అడవిలో ఆతిథ్యం అదరహో..!

- ఆకట్టుకుంటున్న బైర్లూటి ఎకో టూరిజం కేంద్రం
- మధురానుభూతినిచ్చే జంగిల్ సఫారీ
- కనువిందు చేస్తున్న ప్రదేశాలు
- నల్లమల చెంచులే మనకు గైడ్‌లు

ఆత్మకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నల్లమల చెంచులు సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఆదివాసీ తెగల్లో ఒకరైన చెంచులు ఒకప్పుడు అమాయకత్వంతో అడవుల్లోనే జీవనం సాగించేవారు. అయితే వీరిని పోటీ ప్రపంచానికి దీటుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వాలు అనేక ప్రయత్నాలు చేస్తునప్పటికీ ఆశించినంత ఫలితాలు రావట్లేదు. అదే క్రమంలో ఈ ప్రయత్నాలు చెంచుల అస్థిత్వాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని కొంత మంది చెబుతున్నప్పటికీ కాలక్రమంలో అందరిలాగే చెంచుల్లో కూడా మార్పు రావాలన్నది మరికొందరి అభిప్రాయం. ఇందులో భాగంగానే చెంచులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను పెంచే ప్రయత్నాలు నానాటికి జరుగుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగానే ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి సమీపంలో ఏర్పాటైన బైర్లూటి ఎకో టూరిజంలో చెంచు గిరిజనులే కీలక పాత్ర వహిస్తున్నారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు అన్నీ తామై సేవలందిస్తూ ఆతిథ్యంలో అదరహో అనిపిస్తున్నారు. వీరి మర్యాదలను చూసి విదేశీ పర్యటకులు సైతం ఆశ్చర్యానికి లోనవుతున్నారు.



ప్రకృతి ఒడిలోని బైర్లూటి ఎకో టూరిజం కేంద్రం



బైర్లూటి టూరిజం ప్రవేశ ద్వారం

అడవుల ప్రాముఖ్యత తెలియాలంటే..

అనుమతులు లేకుండా అడవిలోకి వెళ్లడం చట్టరీత్యా నేరం. అయితే పర్యావరణానికి పర్యాటకులు చేరువైతేనే అడవులు, వాటి ప్రాముఖ్యతను తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఇందులో భాగంగానే 2017లో బైర్లూటి సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో 2.5 హెక్టార్ల స్థలాన్ని కేటాయించి రూ.82 లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎకో టూరిజం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కేంద్రాన్ని మరింతగా అభివృద్ధి చేస్తూ నాలుగు కాటేజీలు, ఆరు టెంటెడ్ గృహాలు, రెండు ఫ్యామిలీ సూట్ రూమ్స్, ఒక రెస్టారెంట్, చలి విముక్తి కోసం ఫైర్ క్యాంప్, నేచర్ స్టడీ సెంటర్, బట్టర్‌ఫ్లైపార్క్, ఆయుర్వేద వన ప్రదేశం, యోగా కేంద్రం, ధ్యాన మందిరం, పర్యావరణ విద్యా కేంద్రం సిద్ధం చేశారు. అదేవిధంగా చెంచు సాంప్రదాయ క్రీడైన ఆర్చరీ క్రీడా వేదికను ఏర్పాటు చేశారు. పర్యాటక ప్రేమికులు ఆయా కాటేజీల్లో ఒక రోజు బస చేయడంతోపాటు నల్లమల అందాలను వీక్షించేందుకు వీలుగా ప్రత్యేక జంగిల్ సఫారీలను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక రోజు ప్యాకేజీ కింద కాటేజీలకు కాటేజ్ రూమ్స్‌కు రూ.7 వేలు (ఇద్దరికి), ఫ్యామిలీ సూట్ రూమ్స్‌కు రూ.20 వేలు (8మందికి) గా నిర్ధారించారు. ఈ ప్యాకేజీలో భాగంగా ఎకో టూరిజం కేంద్రంలో ఒక రోజు విడిది, అటవీ ప్రాంతంలో సంచారం, ఆహార ఏర్పాట్లన్నింటిని కేంద్రం నిర్వాహకులే భరాయించేలా ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చారు. టెంట్ గృహాల్లో ఏసీ సదుపాయాన్ని కూడా అమర్చారు. రోజంతా ఎకో టూరిజంలో కాలక్షేపం చేసేందుకు అన్ని ఏర్పాట్లను కల్పిస్తున్నారు. కాగా ఈ కేంద్రం నిర్వహణపై డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.నల్లమలజంగిల్‌సఫారీ.కామ్ పేరిట వెబ్‌సైట్ నిర్వహిస్తూ.. ఆన్‌లైన్‌లోనే కాటేజీల బుకింగ్ చేపట్టేలా వెసులుబాటు కల్పించారు. ఈ టూరిజం కేంద్రాన్ని విదేశీయులు కూడా సందర్శిస్తున్నారు.

అందుబాటులో జంగిల్ సఫారీలు

దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా పేరుగాంచిన నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యంలోని అరుదైన వృక్షజాతులు, వన్యప్రాణులను వీక్షించేందుకు వీలుగా 18 కి.మీ. జంగిల్ సఫారీలను అందుబాటులోకి తెచ్చింది. ఎకో టూరిజం కేంద్రం వారు ప్రత్యేక ఏర్పాటు చేసే ఓపెన్‌టాప్ వాహనంలో ప్రయాణిస్తూ వన్యప్రాణులు, నల్లమల ప్రకృతి అందాలను వీక్షించవచ్చు. అలాగే అడవుల, వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ చేస్తున్న కృషిని కూడా పర్యాటకులకు తెలియపరిచేలా సఫారీ మార్గాలను రూపొందించారు. ఇదే మార్గంలోనే నల్లమలలోని అతి ప్రాచీన దేవాలయాలు, కోనేర్లు, మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, దివంగత మాజీ ప్రధానీ జవహర్‌లాల్ నెహ్రూ తదితర ప్లాంటేషన్ చేసిన ప్రదేశాలు సందర్శకులను కనువిందు చేస్తాయి. అంతేగాకుండా ఆరు కి.మీ. మేర అటవీ ప్రాంతంలోని కొండలు, గుట్టలు ఎక్కేందుకు వీలుగా ట్రెక్కింగ్ మార్గాన్ని, అటవీ ప్రాంతంలోని భూమి సారువృత, వృక్షాలు, పక్షులు, క్రిమికీటకాల తదితర వాటి గురించి తెలుసుకునేందుకు వీలుగా నల్లమలలో నేచర్ వాక్‌ను అందుబాటులో ఉంచారు. ఇది సుమారు మూడు. కి.మీ. దూరం ఉంటుంది. నల్లమల చెంచులే పర్యాటకులకు గైడ్‌లుగా వ్యవహరిస్తారు.



నల్లమలలోని జంగిల్ సఫారీ

ఎకో టూరిజం కేంద్రంలో చెంచులదే కీలక పాత్ర

నిజానికి బైర్లూటి టూరిజం కేంద్రం ఏర్పాటులో పర్యావరణాన్ని పర్యాటకుల చెంతకు తీసుకు రావడంతోపాటు ఇక్కడి చెంచులకు కూడా ఉపాధి కల్పించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే బైర్లూటి ఎకో టూరిజంలో సుమారు 24 మంది స్థానిక చెంచులు ఉపాధి పొందుతున్నారు. వీరిలో 14 మంది మహిళలు, పది మంది పురుషులు పని చేస్తున్నారు. ప్రత్యేకించి రూమ్ క్లీనింగ్, గార్డెన్ మెయింటెనెన్స్, డ్రైవింగ్, టూరిస్ట్ గైడ్, జంగిల్ సఫారీ తదితర పనులు చేస్తూ ఉపాధిలో రాణిస్తున్నారు. అంతేగాకుండా బైర్లూటి ఎకో టూరిజం కేంద్రానికి వచ్చే పర్యాటకులకు అతిథి మర్యాదలతో కూడిన సేవలు అందిస్తున్నారు. అంతేకాదు అక్కడికి వచ్చే పర్యాటకులు చెంచుల వెదురుతో చేసే వివిధ రకాల ప్రతిమలను అటవీ శాఖ విక్రయిస్తోంది. తద్వారా మరికొంత మందికి ఉపాధి లభిస్తోంది. కాగా ఉపాధిలో ఎక్కువ మందికి అవకాశం కల్పించేలా 15రోజుల చొప్పున విధులు కేటాయిస్తున్నారు. అలాగే వారానికి ఒక సెలవును మంజూరు చేస్తారు. దీని ప్రకారమే వివిధ పనులు చేసే చెంచులకు 15 రోజులకు రూ.6800 వేతనం చెల్లిస్తున్నారు. అదే క్రమంలో డ్రైవింగ్, సెక్యూరిటీ ఇతర విధులు నిర్వహించే వారికి రూ.10 వేల నుంచి రూ.16 వేల వరకు వేతనాలను ఇస్తున్నారు. ప్రస్తుతం ఎకో టూరిజం కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేసే ఆలోచనలు అటవీ శాఖ అధికారులు ఉన్నారు. ఇదే జరిగితే మరికొంత మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి.

బైర్లూటి ఎకో టూరిజంతో మంచి ఫలితాలు సాధించాం



అనుకున్నట్లుగానే బైర్లూటి ఎకో టూరిజం కేంద్రం ఏర్పాటుతో ఇప్పటి వరకు చక్కటి ఫలితాలను సాధించాం. వీకెండ్స్‌లో వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకులు ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా తరలివస్తున్నారు. అంతేకాదు పలు సందర్భాల్లో విదేశీయులు కూడా ఇక్కడికి వచ్చి ప్రకృతితో కూడిన ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తున్నారు. అదే క్రమంలో వీరికి నల్లమల చెంచులే అతిథి మర్యాదలతో చక్కటి సేవలు అందిస్తున్నారు. ఒకింత చెంచుల్లో ఇది సరికొత్త అధ్యాయానికి దోహదపడుతోంది. ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల చెంచుల జీవన ప్రమాణాలు కూడా వృద్ధి చెందే అవకాశం ఉంది. ఎకో టూరిజాన్ని మరింతగా అభివృద్ధి చేసే ఆలోచనలో ఉన్నాం. అదే జరిగితే మరికొంత మంది చెంచులకు ఉపాధి పెరిగే అవకాశం ఉంటుంది.

– వి.సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్



నల్లమల అభయారణ్యంలోని పెయిడ్ కాటేజీ

సంక్రాంతి నాటికి గుంతల రహిత రాష్ట్రంగా ఏపీ

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ఆర్‌అండ్‌బీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



బనగానపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి నాటికి గుంతల రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బనగానపల్లెలోని మంత్రి కార్యాలయం నుంచి ఆర్‌అండ్‌బీ రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉండి అత్యంత శ్రద్ధతో పనిచేసి, ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల్లో గుంతలు పూడ్చడానికి నెల రోజుల వ్యవధి మాత్రమే ఉందని, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వెనుకబడిన జిల్లాల్లో అధికారులు చొరవ తీసుకొని పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఫిర్యాదుల స్వీకరణకు స్పెషల్ డెస్కులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదు స్వీకరణకు స్పెషల్ డెస్కులు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ పి. రంజిత్‌బాషా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈ నెల 19 నుంచి 24వరకు గుడ్ గవర్నెన్స్ వీక్ - గ్రామాల వైపు పరిపాలన (ప్రశాసన్ గావోం కి ఓర్) నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు స్పెషల్ డెస్కులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో, డివిజనల్ స్థాయిలో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో, పత్తికొండ ఆర్డీవో కార్యాలయంలో, కర్నూలు ఆర్డీవో కార్యాలయంలో, మండల స్థాయిలో ప్రతి ఎంపీడీవో కార్యాలయంలో స్పెషల్ డెస్కులను ఏర్పాటు చేసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. అదేవిధంగా ఈ నెల 23న సుపరిపాలన అంశంపై జిల్లా స్థాయిలో వర్క్‌షాపు నిర్వహించాలని డీఆర్వోను ఆదేశించారు.

మాతా సేవల బలోపేతానికి కిల్కారీ విధానం

డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్



కిల్కారీ పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు సేవల బలోపేతం చేసేందుకు కిల్కారీ మెసేజ్ విధానాన్ని వైద్య ఆరోగ్య శాఖలో ప్రారంభిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ తెలిపారు. మంగళవారం కిల్కారీ మెసేజ్ విధానంపై పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్ల ఆశా నోడల్ ఆఫీసర్ల శిక్షణ ఇచ్చారు. ఈ విధానంలో గర్భిణులకు నాల్గవ నెల నుంచి కాన్పు తర్వాత సంవత్సరం వరకు వారానికోసారి 72 వారాలు రెండు నిమిషాల వాయిస్ మెసేజ్ 01244451660 నెంబరు నుంచి వస్తుందని డీఎంహెచ్‌వో వివరించారు. ఏదైనా కారణం వల్ల గర్భిణి ఆ వాయిస్ మెసేజ్ వినలేకపోయిన తర్వాత 14423 నెంబరుకు కాల్ చేసి వాయిస్ మేసేజ్‌ను వినడానికి అవకాశముందన్నారు. ఈ కాల్స్ పూర్తిగా ఉచితమని, ఎలాంటి చార్జెస్ ఉండవని తెలిపారు. కిల్కారీ ప్రోగ్రాం రీజనల్ కోఆర్డినేటర్ కీర్తి మాట్లాడుతూ మాతృ, శిశు ఆరోగ్య సేవలు, టీకాలు, కుటుంబ నియంత్రణ సేవలు గురించి సలహాలు, సూచనలు, ప్రీ రికార్డెడ్ వాయిస్ మేసేజ్ రూపంలో వస్తాయన్నారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో గర్భిణుల ఫోన్ నెంబర్ అప్‌లోడు చేయాలన్నారు. శిక్షణలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.నాగప్రసాద్, ఆర్‌బీఎస్‌కే పీవో హేమలత, డీపీహెచ్ఓన్‌వో అన్నపూర్ణ, డెమో శ్రీనివాసులు, ఎస్‌వో మేమ సుందరం, జిల్లా కమ్యూనిటీ మొబలైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పత్తి ధర క్వింటాలు రూ.7,234



రేపు పత్తి క్రయవిక్రయాలు జరగవు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు గత వారం రోజులుగా స్థిరంగా ఉన్నాయి. మంగళవారం పత్తి ధర క్వింటాలు గరిష్ఠంగా రూ.7234 పలికింది. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే రూ.350తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. చాలామంది రైతులు ధర పెరుగుతుందని ఆశించి ఇళ్లలో నిలువ ఉంచుకున్నారు. ధరలు స్థిరంగా ఉండటంతో నిరాశ చెందుతున్నారు. 4277 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.4360, గరిష్ఠ ధర రూ.7234, మధ్య ధర రూ. 7089 పలికింది.

ఈనెల 19న మార్కెట్ యార్డుల్లో పత్తి దిగుబడుల క్రయవిక్రయాలు జరగవని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. కాటన్ మర్చంట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఉండడం వల్ల పత్తి వ్యాపారులు తాము విక్రయాలు జరుపలేమని సెలవు ప్రకటించాలని కోరారన్నారు. దీంతో రైతులు తమ పత్తిని మార్కెట్ కమిటీకి అమ్ముకోవడానికి తీసుకురావద్దని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు: కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. మంగళవారం నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని కమిటీ చైర్మన్, కలెక్టర్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో జరిగే 10వ, 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలను సాధించేలా తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాల మైదానంలో క్రీడా కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ర్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. ఒకేషనల్ కోర్సు ల్యాబ్ మంజూరైనందున ఇందుకు సంబంధించి పరిపాలన ఆమోదం కోరుతూ ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ పాయల్ ప్రియదర్శిని మాట్లాడుతూ విద్యాలయ ప్రగతికి మేనేజ్‌మెంట్ కమిటీ అందిస్తున్న సహకారాన్ని ప్రశంసించారు. అంతకు ముందు కేంద్రీయ విద్యాలయానికి చేరుకున్న కలెక్టర్‌కు విద్యాలయ్ ఎన్‌సీసీ స్కౌట్స్ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.శ్రీనివాసరెడ్డి, పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సి.శ్రీనివాసరావు, కేంద్రీయ విద్యాలయ సిబ్బంది ఆంజనేయులు, హిమబిందు, నూర్‌బాషా, షేక్షావలి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

అహోబిలంలో సందడి చేసిన మంచు మనోజ్

స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న మనోజ్, మౌనిక దంపతులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో సినీ హీరో మంచు మనోజ్ తన కుటుంబంతో మంగళవారం సందడి చేశారు. భార్య భూమా మౌనికతో కలిసి ఎగువ అహోబిలం చేరుకున్న మంచు మనోజ్‌కు ఆలయ అర్చకులు వేదమంత్రాలతో స్వాగతం పలికారు. ఎగువ అహోబిలంలోని ఉగ్ర నృసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవారిని మనోజ్ దంపతులు దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు. అహోబిలం ప్రకృతి అందాలను తిలకిస్తూ ఆలయ చరిత్రను వారు తెలుసుకున్నారు. అనంతరం మంచు మనోజ్ విలేకరులతో మాట్లాడు తూ.. మొట్ట మొదటిసారి అహోబిలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని ఇచ్చిందన్నారు. అత్త భూ మా శోభా నాగి రెడ్డి జయంతి సందర్భంగా మా కూమర్తె దేవసేన శోభను మొద టిసారి ఆళ్లగడ్డకు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఎంతో భారంతో వచ్చినప్పటికీ.. మహిమాన్వితుడైన అహోబిలే సుడిని దర్శించుకోగానే మనశ్శాంతిగా ఉందన్నారు. భైరవం, మిరాయి అనే సినిమాలతో ఇండస్ట్రీలోకి కమ్ బ్యాక్ ఇస్తున్న ట్లు సినీ హీరో మంచు మనోజ్ వెల్లడించారు.



అహోబిలంలో దర్శనం అనంతరం బయటకు వస్తున్న మంచు మనోజ్ దంపతులు

వైనాట్ 175 అన్న జగన్ ఎక్కడ..!

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి

ఎమ్మిగనూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైనాట్-175 అన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పులివెందులలో సాగు నీటి సంఘాల ఎన్నికలకు నామినేషన్లు వేసుకోలేని దుస్థితికి వచ్చారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మిగనూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంత దారుణమైన పరిస్థితి ఏ రాజకీయ పార్టీకి రాలేదన్నారు. సాగు నీటి సంఘాలు, డీసీ ఎన్నికల్లో నేడు అన్ని స్థానాల్లో కూడా టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపా రు. ఉనికి కోసమే వైసీపీ నాయకులు అక్కడక్కడా అలజడు లు సృష్టిస్తున్నారని విమర్శించారు. దౌర్జన్యం చేయడమే జగన్ పేటెంట్ హక్కు అని ఎద్దేవా చేశారు. దౌర్జన్యాలు చేయడం వైసీపీ నాయకులకే చెల్లిందని అన్నారు. ఈ కారణంగానే గత ఎన్నికల్లో వైసీపీ నాయకులను ప్రజలు ఘోరంగా ఓడించి ఇంట్లో కూర్చోబెట్టారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తప్పకుండా నెరవేరుస్తారన్నారు. అధికారంలో ఉన్న సమయం లో జగన్ ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేశారని తెలిపారు. హామీలు అమలు చేయలేదని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌పైన బురదజల్లే కార్యక్రమాన్ని మానుకోవాలని హితవు పలికారు. ప్రజలు జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని, దాన్ని మరచి పోయి వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. వీలైతే ప్రభుత్వానికి మంచి సలహాలు ఇవ్వాలని, అదీ చేతకాకుంటే సైలెంట్‌గా ఇంట్లో విశ్రాంతి తీసుకోవాలని అన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, కోసిగి నాయకులు భరద్వాజశెట్టి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ఎన్నికల్లో పట్టు నిలుపుకున్న మంత్రి



ఏకగ్రీవంగా ఎన్నికైన నంద్యాల డీసీలు

గోస్పాడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పట్టు నిలుపుకున్నారు. నంద్యాల నియోజకవర్గంలోని మూడు డీసీ చైర్మన్ స్థానాలు ఫరూక్ వర్గానికే దక్కాయి. 4వ డీసీగా కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, 5వ డీసీగా చాబోలు ఇలియాస్, 6వ డీసీగా శీలం భాస్కరరెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, మీదివేముల సుదర్శన్‌రెడ్డి, పంజుగల చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారి విశ్వనాథం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌లో నంద్యాల డీసీలు కీలకం : కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నికలో డీసీలు కీలకం కానున్నారు. కేసీసీకు మొత్తం 14 డీసీలు ఉండగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఆరుగురు ఉన్నారు. అయితే నంద్యాల జిల్లాలో ఏడుగురు ఉండటంతో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి నంద్యాల జిల్లాకే అవకాశాలు ఉన్నాయి.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి: జేసీ

రుద్రవవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయ్ గోడౌన్ నుంచి సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీచరణ్ అన్నారు. మంగళవారం రుద్రవరంలో కొత్తగా ఏర్పాటు చేసి సివిల్ సప్లయ్ గోడౌన్‌ను తనిఖీ చేశారు. గోడౌన్‌లో సరుకులన్నింటిలో భాగం గా బస్తాలను లెక్కించారు. స్టాక్ పాయింట్ రికార్డులు సక్రమంగా ప్రతి నెలా అప్‌డేట్‌గా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పౌర సరఫరాల కార్యాలయం నుంచి సమాచా రం ఉండాలన్నారు. అలాగే యలవతల గ్రామ సమీపంలో పెట్రోల్ బంక్ స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జున రావు, సివిల్ సప్లయ్ గోడౌన్ ఇన్‌చార్జీ నాగాంజనేయులు ఉన్నారు.



సివిల్ గోడౌన్‌లో రేషన్ బస్తాలను తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీచరణ్

'కపటి' కేసులో నిందితుల అరెస్టు

• నేడు డోన్ కోర్టుకు తరలింపు

ఆదోని రూరల్ డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కపటి గ్రామం లో బీజేపీ నాయకుడు ఈరన్న కుటుంబంపై దాడికేసులో నిందితులను ఇస్వీ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్.ఐ నాగేంద్ర తెలిపిన మేరకు.. గత శనివారం రాత్రి ఈరన్న, అతని భార్య రాధమ్మ, ఇద్దరు బిడ్డలపై అదే గ్రామానికి చెందిన బోయ ఈరమ్మ, వెంకటేశులు, వెంకటస్వామి, గోవిందరాజులు, రవి, తిరుమల, వీరేష్, గిడ్డయ్య గొడ్డలి, ఇనుపరాడ్‌లతో దాడి చేశారు. బాధితురాలు రాధమ్మ ఫిర్యాదు మేరకు 8మందిపై సెక్షన్ 109 బీఎన్ఎస్ యాక్టు కింద హత్యా యత్నం కేసు నమోదు చేశారు. నిందితులను మంగళవారం సాయంత్రం ఆదోని-ఎమ్మిగనూరు బైపాస్‌లోని కపటి క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఆదోనిలో న్యాయాధికారి అందుబాటులో లేకపోవడంతో వీరిని బుధవారం డోన్ కోర్టుకు తరలిస్తాం. గ్రామంలో పోలిస్ పికెటింగ్ ఏర్పాటు చేశామని ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా తీవ్రంగా గాయపడ్డ ఈరన్న కర్నూలు ఆసుపత్రిలో అతని భార్య రాధమ్మ, బిడ్డలు ఆదోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

నిందితుల అరెస్టు

పాణ్యం, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని పిన్నాపురం పరిధిలోని సోలార్ ప్రాజెక్టులో ఈనెల 9న కాపర్ చోరీ అయినట్లు కేసు నమోదైందన్నారు. సోలార్ ప్రాజెక్టులోని 3200ల కాపర్ తీగెలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. నిందితులు పిన్నాపురానికి చెందిన తలారి మహేంద్ర, పోలూరు ఎల్లయ్య, శీలం మహేశ్, నంద్యాల వీసీ కాలనీకి చెందిన షేక్ ఫరూక్, చుక్క పేటకు చెందిన ఇళకల మధు, నందమూరి నగర్‌కు చెందిన షేక్ అక్బర్‌బాషాలను అరెస్టు చేసి కోవెలకుంట్ల న్యాయ స్థానంలో హాజరు పరిచినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 240 కిలోల కాపర్, ఆటో, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నంద్యాల మున్సిపల్ కార్యాలయం పక్కన గల గుజ్రీ షాపులో కాపర్‌ను అమ్మినట్లు తెలిపారు. అమ్మిన నగదు రూ. 1. 60 లక్షలను చోరీ నిందితులకు ఫోన్‌పే చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొణిదేల గ్రామంలో పురుగుల మందు తాగి మల్లికార్జున(25) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నందికొట్కూరు ఎస్ఐ చంద్ర శేఖర్, గ్రామస్థులు తెలిపిన వివరాలివీ.. మల్లికార్జున అనే యువకుడు మద్యానికి బానిసై మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఉండేవాడు. మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. తల్లిదండ్రులు శ్రీశైలంలో పని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. యువకుడి తండ్రి తిరుపాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు మృతి

సి.బెళగల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమాల గ్రామానికి రైతు మద్దిలేటి(46) అప్పుల బాధతో మంగళవారం మృతి చెందాడు. మద్దిలేటి తనకు ఉన్న ఎకార పొలంతోపాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప, పత్తి, ఉల్లి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తూ జీవనం కొసాగిస్తుండేవాడు. అయితే గత 5 సంవత్సరాల నుంచి పంట పెట్టుబడులకు తెచ్చిన రూ.10 లక్షలకు పైగా అప్పులు పెరిగిపోయాయి. ఎలా చెల్లించాలో అర్థంగాక కుటుంబ సభ్యులతో కలిసి మదన పడుతూ ఉండేవాడే. ఈ క్రమంలోనే పొలంలో పని చేస్తుండగా ఉన్నపాటున కుప్పకూలాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఏసుమణి, ఇద్దరు కుమార్లు, కూతురు ఉన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం టీడీపీ ఉపాధ్యక్షుడు నాగరాజు కుటుంబాన్ని కోరారు. పౌలు, భాస్కర్, రంగన్న, రాముడు పాల్గొన్నారు.

ప్రేమ జంటపై వేట కొడవళ్లతో దాడి

• పారిపోయిన ప్రియురాలు
• ప్రియుడికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

గోనెగండ్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రేమ జంటపై యువతి బంధువులు వేట కొడవళ్లతో దాడి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎమ్మిగనూరుకు చెందిన అరవిందు రెండేళ్లుగా ఓ యువ తిని ప్రేమిస్తున్నాడు. ఇద్దరి మధ్య కొంతకాలంగా ప్రేమ వ్యవహారం సాగుతోంది. యువతి ప్రవర్తనపై అనుమానం రావడంతో కుటుంబ సభ్యులు ఆమె కదలికలపై దృష్టి పెట్టారు. మంగళవారం అరవిందు,యువతితో కలిసి గాజులదిన్నె ప్రాజెక్ట్ వద్ద ఉన్న ఎల్లెల్సీ పరిసరాల్లోకి వెళ్లారు. అక్కడ రహస్య ప్రదేశంలో ఉన్న వారిపై వేట కొడవళ్లతో దాడి చేశారు. యువతి పారిపోగా, అరవిందుపై కొడవళ్లతో దాడి చేశారు. అరవిందు కాపాడండి అంటు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న రైతులు రాళ్లతో దాడి చేయడంతో వారు పారిపోయారు. అరవిందుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు బాధితుడిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

గొర్రెల కాపరి దారుణ హత్య




మృతుడు అశ్రఫ్‌వలి, నిందితుడు షేక్ షఫి(ఫైల్)

ఆత్మకూరు రూరల్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో దారుణ హత్య జరిగింది. ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన అశ్రఫ్ వలి (35)అనే వ్యక్తిని అతని సమీప బంధు వైన షేక్ షఫి గొడ్డలితో నరికి చంపాడు. ఆత్మకూరు సీఐ రాము వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అశ్రఫ్ వలి, శ్రీపతిరావు పేట గ్రామానికి చెందిన షేక్ షఫిలు ఇద్దరు వరుసకు బావామరుదులు. వృత్తిరీత్యా ఇద్దరు గొర్రెల కాపరులు. కలిసే గొర్రెలు మేపుకునేవారు. మనస్పర్థల కారణంగా వారం రోజులుగా గొర్రెలను వేరు వేరుగా మేపుకుంటున్నారు. కాగా సోమవారం ఇద్దరు ఇందిరేశ్వరం చెంచు గూడెం వద్ద గొర్రెలను మేపుకునేందుకు వెళ్లారు. కాపలా విష యంలో ఇద్దరికి వాగ్వావాదం చోటుచేసుకుంది. అనంతరం నిదిస్తున్న అశ్రఫ్ వలిని షేక్ షఫి గొడ్డలితో దాడి చేసి చంపాడు. బంధువుల సమాచారం మేరకు మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

• ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో చదివే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తూ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు మంగళవారం జారీ చేశారు. ఈ ఉత్తర్వులు పకడ్బందీగా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వివిద జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి మేరకు కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో అమలయ్యేలా చూడాలని డీఈవోలు, ఎంఈవోలు, డీఈవో శ్యామ్యూల్ పాల్‌కు సూచించారు.

ఏపీయూడబ్ల్యూజే హర్షం

కర్నూలు కల్చరల్: ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇస్తూ కలెక్టర్ పి. రంజిత్ బాషా, డీఈవో శామ్యూల్ పాల్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. దీనిపై ఐజేయూ సభ్యులు గోరంట్ల కొండప్ప, కే నాగరాజు, ఏపీయూ డబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసగౌడ్, నాయకులు ఎన్‌వీ సుబ్బయ్య, కృష్ణారెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశా రు. ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్ స్కూళ్లలో జర్నలిస్టుల పిల్లలకు మొత్తం ఫీజులో 50 శాతం రాయితీ కోసం ఏపీయూడబ్ల్యూజే మొదటి నుంచి డిమాండ్ చేస్తోందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, డీఈఓలకు కృతజ్ఞతలు తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో యూనియన్ నాయకులు బి. సుంకన్న, అంజి, హరికిషన్, మధుసూదనగౌడ్, హుస్సేన్, దస్తగిరి, అవినాష్, శివరాజ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

జోరుగా కర్ణాటక మద్యం

కోసిగి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో అక్రమ కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు నాయకులు, కార్యకర్తలు కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తరలించి జేబులు నింపుకున్నారు. గతంలో అమ్ముతున్న వారే కూటమి ప్రభుత్వంలో కూడా కర్ణాటక మద్యం యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తుండడం గమనార్హం. కోసిగి, కౌతాళం మండలాలకు తుంగభద్ర నది అవతలనే కర్ణాటక బార్డర్ ఉండటంతో పుట్టిల ద్వారా రాత్రి సమయాల్లో నదీతీర గ్రామాల్లో రవాణా సరఫరా జరుగుతోంది. మంత్రాలయం నియోజకవర్గంలో ఈ ఆరు నెలల్లో సుమారు రూ.15 లక్షల మేర అక్రమ మద్యం పట్టుబడిందంటే రవాణా ఎలా సాగుతుందో తెలుసుకోవచ్చు. సుమారు 250 మందిపై కర్ణాటక మద్యం అక్రమ రవాణ దాడుల్లో కేసులు నమోదయ్యాయి.



ఉరుకుంద పుణ్యక్షేత్రంలో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు

• కోసిగి మండలంలో కడిదొడ్డి, కందుకూరు, తుమ్మిగనూరు, కోల్‌మాన్‌పేట, దుద్ది, ఆర్లబండ, వందగల్లు, పెద్దభోంపల్లి, చిన్నభోంపల్లి, బెళగల్, చిర్తనకల్, మూగలదొడ్డి, సాతనూరు, ఆగసనూరు తదితర గ్రామాల్లో కర్ణాటక మద్యం విక్రయాలు ఎక్కువగా సాగుతున్నాయి.
• కౌతాళం మండలంలో నదిచాగి, గుడికంబాలి, మరళి, హాల్వి, బాపురం, బదినేహాల్, మల్లన్నహట్టి తదితర గ్రామాల్లో కర్ణాటక మద్యం పుష్కలంగా లభిస్తోంది.
• పెద్దకడుబూరు మండలంలో పెద్దకడుబూరు, చిన్నకడుబూరు, మురవణి, కంబదహాల్, జాలవాడి, హనుమాపురం, బసలదొడ్డి, పీకలబెట్ట, గవిగట్టు గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.
• మంత్రాలయం మండలంలో మంత్రాలయం, మాధవరం, తుంగభద్ర, చిలకలడోన, చెట్నిపల్లి, మాలపల్లి, సుంకేశ్వరి, లక్ష్మారి, తదితర గ్రామాల్లోనూ కర్ణాటక మద్యం విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి.

నిఘా ఉంచి కేసులు నమోదు చేస్తున్నాం

కర్ణాటక మద్యం ఎక్కడి నుంచి ఎక్కడెక్కడ సరఫరా జరుగుతుందో.. దాడులు చేసి కట్టడి చేస్తాం. అక్రమ మద్యం తరలించి విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్ చేస్తున్నాం. కర్ణాటక మద్యం తరలించే వారిపై వ్యవహరిస్తున్నాం పదే పదే అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడితే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తాం. **- భార్గవ్‌రెడ్డి, కోసిగి ఎక్సైజ్ సీఐ**





స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితులతో కోసిగి పోలీసులు

ఆటోను ఢీకొన్న లారీ

• ఓర్వకల్లు జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదం
• డ్రైవర్ సహా ఐదుగురికి తీవ్ర గాయాలు



సంఘటనా స్థలంలో విద్యార్థుల తల్లిదండ్రులు

ఓర్వకల్లు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో వెళుతున్న ఓ ఆటోను లారీ ఢీకొట్టడంతో విద్యార్థులకు గాయాల య్యాయి. జాతీయ రహదారి-40పై స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని శేషయ్య హోటల్ ఎదురుగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని కన్నమడకల గ్రామానికి చెందిన వడ్డె స్వాములు ప్రతి రోజూ విద్యార్థులను తన ఆటోలో మోడల్ స్కూల్‌కు తీసుకెళుతుంటాడు. రోజు మాదిరి మంగళ వారం ఉదయం విద్యార్థులను తీసుకెళు తున్న సమయంలో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను అధిగమించేందుకు ఆటోను కుడి వైపుకు తిప్పాడు. అదే సమయంలో కర్నూలు వైపు వెళుతున్న లారీ ఆటోను వెనుక నుంచి ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. విద్యార్థులతోపాటు బ్యాగులు చెల్లాచె దురుగా పడిపోయాయి. ప్రమాద విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదం డ్రులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని స్థాని కుల సహాయంతో క్షతగాత్రులను 108లో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇంటర్ విద్యార్థి సుమంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. విద్యార్థులను మోడల్ స్కూల్ వద్ద నుంచి తీసుకొచ్చే క్రమంలో స్కూల్ ఆటో లన్నీ నిత్యం వ్యతిరేక మార్గంలో హైవేపై వస్తున్నాయని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డు పూర్తి చేయడంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే చాలా వరకు ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తు న్నారు. ఘటనా స్థలాన్ని ఓర్వకల్లు ఎంఈవో ఓంకార్ యాదవ్ ప్రమాదంపై స్థానికులను విచారించారు. ఓర్వకల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన ఆటో

విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే, అధికారులు

విద్యార్థులను ఎమ్మెల్యే గౌరు చరిత, కలెక్టర్ రంజిత్ బాషా, జేసీ డా.నవ్య, ట్రైనీ కలెక్టర్ కళ్యాణి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆర్డీవో సందీప్ కుమార్, డీఈవో శ్యామ్యూల్ పాల్, రూరల్ సీఐ చంద్ర బాబు నాయుడు, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ పరామర్శించారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను, ఆటో డ్రైవర్ ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తూ వైద్య సేవలందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.




విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, మాజీ ఎమ్మెల్యే కాటసాని

ప్రశ్నించే గొంతుక వైఎస్ షర్మిల

• డీసీసీ అధ్వర్యంలో జన్మదిన వేడుకలు



కర్నూలులో కేక్ కట్ చేస్తున్న మురళీకృష్ణ



వృద్ధులకు కేక్ పంచుతున్న నరసింహయాదవ్

కర్నూలు అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ప్రజా గొంతుక అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ అన్నారు. మంగళవారం కర్నూలు నగరంలోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల పక్కన ఉన్న హోం ఆఫ్ హోప్ అనాథ ఆశ్రమంలో షర్మిల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి చిన్నారులకు అల్పా హారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయ కులు సుబ్రహ్మణ్యం, సాయికృష్ణ, ప్రతా పరెడ్డి, మల్లేశ్వరీ, ప్రమీల పాల్గొన్నారు.

నంద్యాల డీసీసీ అధ్వర్యంలో..

పాణ్యం నియోజకవర్గం లోని 19వ వార్డులోని శిరిడి సాయి వృద్ధాశ్రమంలో నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ అధ్వర్యంలో వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు జరిగాయి. వృద్ధుల నడుమ కేక్ కట్ చేశారు. నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఎవరికైనా సమస్య వస్తే తనకు ఒక్క ఫోన్ కాల్ చేస్తే వెంటనే స్పంది స్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రజాక్ వలి, జాకీర్ హుస్సేన్, పీసీసీ సభ్యుడు పఠాన్ హబీబ్ ఖాన్, విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 378 అర్జీలు

• జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 27 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 378 అర్జీలు స్వీకరించామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ అన్నారు. గోనెగండ్ల మండలంలోని ఆల్వాల్ గ్రామంలో 37, నందవరం మండలంలోని ధర్మాపురం గ్రామంలో 1, ఎమ్మిగనూరు మండలంలోని దివ్విబెట్ట గ్రామంలో 9, కోసిగి మండలంలోని భీంపల్లి గ్రామంలో 37, మంత్రాలయం మండలంలోని మాలపల్లి గ్రామంలో 13, పెద్దకడుబూరు మండలంలోని చిన్నకడుబూరు గ్రామంలో 2, ఆదోని మండలంలోని పెసలబండగ్రామంలో 9, సుల్తానాపురం గ్రామంలో 3, హొళగుంద మండలంలోని పాండవగల్లు గ్రామంలో 11, కౌతాళం మండలంలోని ఉప్పరల్ల గ్రామంలో 13, కుంతలహాల్‌లో 10 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలం ఉప్పల పాడులో 10, కల్లూరులో 18, వెల్దుర్తి మండలంలోని పుల్లగుమ్మిలో 10, కోడుమూరు మండలం ముడుమలకకుర్తి గ్రామంలో 26, కర్నూలు రూరల్‌లోని పి.రుద్రవరంలో 47, గూడూరు మండలంలోని పొన్నకల్లులో 7, సి.బెళగల్ మండలంలోని పలుకుదొడ్డి గ్రామంలో 8, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని పత్తి కొండ మండలం నలకదొడ్డి గ్రామంలో 15, క్రిష్ణగిరి మండలంలోని కటారి కొండలో 9, మద్దికెర వెస్ట్‌లో 14, ఆలూరు మండలంలోని కురుకుంద గ్రామంలో 17, చిప్పగిరి మండలంలోని గుమ్మనూ రులో 14, ఆస్పరి మండలంలోని జోహరాపురంలో 9, హాలహర్వి మండలంలో చింతకుంట గ్రామంలో 15, సిరుగాపురంలో 4, దేవనకొండ మండలంలో నల్లచెలిమలలో 10 అర్జీలు స్వీకరించామని చెప్పారు. ఇందులో అసైన్మెంట్ భూములకు సంబంధించినవి 25, అసైన్‌మెంట్ హౌస్ సైట్స్‌కు సంబంధించి 5, అసైన్‌మెంట్ గవర్నమెంట్ ల్యాండ్స్ 5, రీసర్వేకు 41, మీసేవా గ్రీవెన్స్ 2, ఇనాం భూములకు 5, భూసేకరణపై ఫిర్యా దులకు సంబంధించినవి 3, ఆర్‌వోఆర్ కేసులకు 229, మిగతావి 52, దారి వివా దాలకు సంబంధించి 2 అర్జీలు వచ్చాయని వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

• రూ.31.40 లక్షలు స్వాధీనం, రెండు కార్లు, 40 సెల్ ఫోన్లు సీజ్

కర్నూలు క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో పేకాట స్థావరంపై పోలీసులు మూకుమ్మడి దాడులు నిర్వహించారు. డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, పది మంది ఎస్ఐలు, 20 మంది దాకా స్పెషల్ పార్టీ బృందాలు మంగళవారం రాత్రి బుధవారపేటలో ఉన్న అసదుల్లాకు చెందిన పేకాట స్థావరంపైన ఈ దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో 31 మంది జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకోగా ఆరుగురు పరారయ్యారు. వీరి నుంచి రూ.31.40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచే అసదుల్లాకు చెందిన ఈ స్థావరంలో పేకాట నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ స్థావరాన్ని ఆర్గనైజర్లు సయ్యద్, రవిలు నిర్వహిస్తున్నారు. సయ్యద్ అసదుల్లా పోలీసులకు చిక్కగా.. రవి పరారయ్యాడు. నంద్యాల, శిరివెళ్ల, గుత్తి తదితర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి పేకాట ఆడుతున్నట్లుగా పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. నిందితుల నుంచి 2 కార్లు, 40 సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఖాళీ స్థానాల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయ రాజు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఎస్‌జీటీ, ఎస్‌ఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ విషయంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళామని అన్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాలలో దాదాపు మూడు వేలు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అకడమిక్ ఇయర్ అంతా ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాటు లేకుండా ముగిసి పోతుందన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయని, డీఎస్సీ నియామకాలు జరిగే వరకు వెంటనే అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని కోరారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులు చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరింది. మంగళవారం నగర పాలక కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మనోహర్, నగరాధ్యక్షులు వెంకటేశ్వర్లు, జ్ఞానమ్మ, షేక్షావలి పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

నందికొట్కూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు సబ్ జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరామచంద్ర రావు, జైలు విసిటింగ్ న్యాయవాది అరుణ్‌కుమార్, సబ్ జైలును సందర్శించారు. ఖైదీల వివరాలతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకోలేని వారికి న్యాయ సహాయం అందిస్తామని తెలియజేశారు ఎంఎల్ఎస్‌సీ సిబ్బంది, జైలు సూపరింటెండెంట్ జనార్దన్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి: డీపీవో

వెలుగోడు డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని డీపీవో జమీవుల్లా సూచించారు. మంగళవారం వెలుగోడు ఎంపీడీవో కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి, సుపరిపాలనపై నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని డీపీవో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది, తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలు అనారోగ్యాలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఈవోఆర్డీ మురారి, ఈవో సుంకన్న హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానికీకరణ సుస్థిర, అభివృద్ధి లక్ష్యాల తొమ్మిది థీమ్స్‌పై సచివాలయ సిబ్బంది రెండో బ్యాచ్‌కు శిక్షణను ఇచ్చారు. వెలుగు ఎంపీఎం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర పరిశీలకుడు వెంకటరత్నం సూచించారు. మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవగుప్తా, జల్‌జీవన్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ భీమశంకర్‌రెడ్డి, ఈవోఆర్డీ మహిధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వైద్య సిబ్బంది

మహానంది, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.తిమ్మాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి అధ్యక్షతన సెమీ క్రిస్మస్ వేడుకలను వైద్యాధికారి భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సి.సుదర్శన్ బాబు చేతుల మీదుగా అడ్వాన్స్ క్రిస్మస్ కేక్‌తో పాటు క్యాండిల్స్‌ను వెలిగింపజేశారు. వైద్యాధికారులు భగవాన్‌దాస్, కేఎన్ శ్రీనివాసులు, వేణుకార్తీకేయ, వెంకటరెడ్డి, ఎంపీహెచ్‌ఈవోలు విజయ్‌రెడ్డి, జగదీష్, వీహెచ్ఎన్ అమీనాబీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోస్పాడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కానాలపల్లెలో కేక్‌కట్ చేసి కార్యకర్తలకు అందించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పుల్లయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సికిందర్, సోషల్ మీడియా అధ్యక్షుడు నాసరయ్య, కార్యకర్తలు లోక్‌నాథ్, కిరణ్, శ్రీను, హుశేన్‌వలి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నరహరి సత్యనారాయణ

ఆత్మకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నరహరి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక శ్రీవాసవీ కళ్యాణ మంటపం నందు నిర్వహించిన ఈ ఎన్నికలో నరహరి సత్యనారాయణకు ఈ బాధ్యతలను అప్పగించారు. అదేక్రమంలో మూడేళ్ల పాటు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన భీమిశెట్టి కృష్ణమూర్తిని ఆ సంఘం గౌరవాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకాన్ని ఉంచి అప్పగించిన బాధ్యతలకు అన్ని విధాలుగా న్యాయం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆ సంఘం వారు ఆయన్ని ఘనంగా సత్కరించారు.

వ్యక్తి మృతి



మృతిచెందిన షాజుద్దీన్

ఆత్మకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో గల మైనార్టీ కాలనీలో అయ్యలూరు షాజుద్దీన్ (51) అనే వ్యక్తి మంగళవారం మృతిచెందారు. మైనార్టీ కాలనీ సమీపంలో ఓ చెట్టు కింద షాజుద్దీన్ మృతిచెందడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని వివరాలు ఆరా తీశారు. గుంటూరు జిల్లాలోని కాకుమాను మండలంలో గల కొమ్మూరు గ్రామానికి చెందినట్లుగా గుర్తించారు. కాగా షాజుద్దిన్ కొన్నిరోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైనట్లు తెలిసింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులు కూడా అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే ఆయన మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి: కలెక్టర్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో గుర్తించిన 23 బ్లాక్ స్పాట్లో ఎలాంటి చర్యలు చేపట్టారని కలెక్టర్ ఆరా తీసారు. శాంతిరాం మెడికల్ కాలేజీ, చాబోలు, కుందూ బ్రిడ్జి, బొగ్గులైన్ తదితర బ్లాక్‌స్పాట్‌లలో అవసరమైన స్పీడ్ బ్రేకర్లు, ఎలిమినేషన్, గుర్తింపు సూచికల బోర్డులు, జిగ్‌జాగ్ బారికేడింగ్ తదితర పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న ఏడు జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులతో సంయుక్త తనిఖీలు నిర్వహించి ప్రమాద ఘటికల ప్రదేశాలను గుర్తించి తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందిన్నారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో బారికేడ్స్, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. 1033 హెల్ప్‌లైన్ బోర్డులు, ఎస్ఎస్‌వో బటన్ నొక్కడం, ప్రతి టోల్‌ప్లాజాలో అంబులెన్స్ తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ ప్రధాన రహదారిలో ఇరువైపుల ఉన్న చెట్లపొదలను తొలగించడంతో పాటు స్పీడ్ బ్రేకర్ల ముందు, వెనుక భాగాల్లో పెయింటింగ్ వేయాలన్నారు. జిల్లాలో ఉన్న నలుగురు డీఎస్పీలు రోడ్డు ప్రమాదాలకు సంబందించి హిట్, రన్‌కేసుల బాధితులకు పరిహారం చెల్లింపుపై ఆర్డీవోలతో సమన్వయం చేసుకొని నివేదికలు ఇవ్వాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

'హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించాలి'

ప్రభుత్వ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ రాజకుమారి సంక్షేమ అధికారులు, ఇంజనీర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 37 ఎస్సీ, బీసీ, ఇతర సంక్షేమ వసతి గృహాల్లో నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్ పరికరాలు, మస్కిటో నెట్‌లు, తలుపులు, మరమ్మతులు, పై కప్పు లీకేజీ, ఫ్లోరింగ్, ప్రహరీ తదితర పనులకు ప్రభుత్వం రూ.8.29 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. సమస్యలను గుర్తించి ఎస్టిమేట్లు తయారు చేసి పరిపాలన ఉత్తర్వులు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో సంబంధిత పనులకు టెండర్లు పిలిచి పనులు అప్పగించి జనవరిలో పనులు ప్రారంభించాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరిలోపు పూర్తి చేసిన పనులన్నింటికి మార్చి 1లోపు బిల్లులు సమర్పించాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, ట్రైబల్ వెల్ఫేర్, ఏపీడబ్ల్యూఐడీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, సమగ్ర శిక్ష అభియాన్ ఇంజనీర్లు వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'



సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం బిల్లులతో పాటు స్కావెంజర్స్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకురాలు రమిజాబీ, శంషాద్, స్కావెంజర్స్ యూనియన్ నాయకురాలు బేగం, ప్రభావతి డిమాండ్ చేశారు. ఆత్మకూరు విద్యాశాఖ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి బిల్లులను సకాలంలో ఇవ్వకపోవడం వల్ల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీ రూ.20కి పెంచాలని, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే స్కావెంజర్స్ పెండింగ్ వేతనాలను తక్షణమే ఇవ్వాలన్నారు. రాజకీయ వేధింపులు మానుకోవాలన్నారు. అనంతరం ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకురాలు ముబారక్, షాలిబీ, హుషాన్‌బీ, బేగం, శాంతకుమారి, బషిరూన్, మేరమ్మ ఉన్నారు.

'ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం'

ఆత్మకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెల్త్ సూపర్‌వైజర్లు రవికుమార్, మస్తానయ్య, మెరిబా స్వచ్ఛంద సంస్థ మేనేజర్ జుల్ఫీకర్ అలీఖాన్ పిలుపునిచ్చారు. ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట మంగళవారం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి సుఖవ్యాధులు, ఎయిడ్స్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే కరదీపికలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సంజమ్మ, సరస్వతి, గౌసియా, కీర్తి తదితరులు ఉన్నారు.

'జయప్రదం చేయాలి'

నంద్యాల కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 6 నుంచి 8వ తేదీ వరకు యాగంటిలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ పిలుపునిచ్చారు. నంద్యాలలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ 3 రోజుల పాటు యాగంటిలో జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ప్రధాన నాయకులకు శాస్త్రీయ విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులలో శిక్షణ ఇచ్చి, చివరి రోజు వర్క్ షాపు నిర్వహించి విద్యా రంగంలో వస్తున్న మార్పుల గురించి వివరిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నెరవాటి రాజా, జిల్లా నాయకులు హర్షవర్ధన్, సందీప్, కిషోర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి'



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు జనార్దన్‌రావు

ఆత్మకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయుడు జనార్దన్ రావు, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పేల్ మున్నా సూచించారు. ఆత్మకూరులోని ఎన్టీఆర్-కేవీకే స్టేడియంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో జాబ్ మేళా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. జాబ్ మేళా కార్యక్రమంలో 5 ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేశారని చెప్పారు. మొత్తం 51 మంది హాజరు కాగా అందులో 28 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వాలీబాల్ కోచ్ నిమ్మి కృష్ణ, ఉపాధ్యాయులు దేవానంద్, పాఠశాల కమిటీ చైర్మన్ శివకుమార్ తదితరులు ఉన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని

నందికొట్కూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్‌లో తాగునీటి కోసం మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని నూతన బోరు వేసేందుకు భూమి పూజ నిర్వహించారు. మంగళవారం బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్‌లో ఉన్న ఏబీఎం చర్చి ప్రాంతంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, 15వ వార్డు కౌన్సిలర్ కృష్ణవేణి నూతన తాగునీటి బోరు వేసేందుకు పూజలు నిర్వహించారు. వైస్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అలగనూరు రిజర్వాయర్ నుంచి సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణం కోసం ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోర్లు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ చిన్న రాజు, వార్డు ఇన్‌చార్జి బ్రహ్మయ్య ఆచారి, టీడీపీ నాయకులు గోవర్ధన గిరి, ప్రసాద్, జగదీష్, రమేష్, నాగేషులు, మద్దిలేటి, లాజరస్, ఆచారి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవం



నందికొట్కూరు: ఎమ్మెల్యే జయసూర్యను సన్మానిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్లు



పాణ్యం: అధ్యక్షులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

బండిఆత్మకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ-2 కమిటీ అధ్యక్షుడిగా కంచర్ల మనోహర్‌చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈఈ పార్థసారధి తెలిపారు. మంగళవారం బండిఆత్మకూరు మండలంలోని తెలుగుగంగ డీబీసీ-2 పరిధిలోని 7 మంది చైర్మన్లతో ఎన్నిక నిర్వహించామని చెప్పారు. ఉపాధ్యక్షుడిగా అల్లె ఈశ్వరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. వీరికి ధ్రువీకరణ పత్రాలను ఆయన అందజేశారు. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను మండలంలోని పలు గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందించారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

నందికొట్కూరు/జూపాడుబంగ్లా: జూపాడు బంగ్లా మండలంలోని 80బన్నూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కట్టా పరమేశ్వరరెడ్డి కేసీ కాలువ డీసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేసీ కాలువ సుంకేసుల ప్రాజెక్టు నుంచి 120 కిలోమీటరు వరకు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌ఎన్నిక మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. నందికొట్కూరు పట్టణంలోని కేసీ కెనాల్ కార్యాలయంలో ఈఈ ప్రతాప్, డీఈ ప్రసాదరావు సమక్షంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. వైస్ చైర్మన్‌గా రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడారు. సాగునీటి కాలువల మరమ్మతులు, సాగు నీటి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ మాండ్ర శివానందరెడ్డికి, ఎమ్మెల్యే జయసూర్యకు తన కృతజ్ఞతలు తెలిపారు.



బండిఆత్మకూరు: మనోహర్ చౌదరికి ఎన్నిక పత్రం అందజేస్తున్న ఈఈ

కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరం ప్రసాదరెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, వలుచాని మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: ఎస్సార్బీసీ కాడా డివిజన్ పరిధిలోని 1 నుంచి 5 బ్లాకుల ఎని మిది సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షుడిగా రాంపుల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా విశ్వేశ్వరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఎస్సార్బీసీ నంద్యాల పరిధిలోని రెండు సాగునీటి సంఘాల అధ్యక్షుడిగా ఎన్.ఫయాజ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన చైర్మన్లను టీసీలు అభినందించారు. టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ఎంపీటీసీ రంగరమేష్, నాయకులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల అందజేత

వెలుగోడు: వెలుగోడు మండలంలోని వేల్పనూరు కేసీ కెనాల్ 2,3 సాగునీటి సంఘాలకు ఎన్నికైన వారికి మంగళవారం ఆర్డీవో నాగజ్యోతి ధ్రువీకరణ పత్రాలు అందించారు. కేసీ కెనాల్-2 సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా జి.తిమ్మారెడ్డిని, ఉపాధ్యక్షుడిగా ఆల్‌ఫ్రెడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కేసీ కెనాల్-3 సాగునీటి సంఘం అధ్యక్షుడిగా బన్నూరు రామలింగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఈశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని టీడీపీ నాయకులు, రైతులు అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, కేసీ కెనాల్ అధికారులు, టీడీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, రెడ్డి కృష్ణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, ధర్మారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వెలుగోడు: వేల్పనూరులో ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఆర్డీవో

'సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు'

జూపాడుబంగ్లా, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు భూ సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఉప తహసీల్దార్ సత్యదీప్ తెలిపారు. 80బన్నూరు గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఉపతహసీల్దార్ నాగన్న, సర్వేయర్ అతీఫ్, వీఆర్వో అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల(ఆంధ్రజ్యోతి): పాత ముచ్చుమర్రి గ్రామంలో తహసీల్దార్ శివరాముడు ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు, ఆర్ఐ రంగారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): ఎర్రమఠం గ్రామ సచివాలయం ఆవరణలో సర్పంచ్ బాల ఎల్లయ్య అధ్యక్షతన, తహసీల్దార్ ఉమారాణి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సోషల్ వెల్ఫేర్ డీడీ, మండల ప్రత్యేక అధికారి చింతామణి, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, మండల సర్వేయర్ అనూషారాణి, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్(ఆంధ్రజ్యోతి): వడ్లరామాపురం గ్రామంలో తహసీల్దార్ రత్నరాధిక ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూగా తహసీల్దార్ అంజనేయులు, ల్యాండ్ సర్వే అధికారి రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల(ఆంధ్రజ్యోతి): మండలంలోని గని గ్రామంలో మంగళ వారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ వెంకటరమణ, టీడీపీ నాయకులు హర్ష, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆవిష్కరణలకు ప్రశ్నలే మూలం'

పాణ్యం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సమస్యలపై ప్రశ్నించినపుడే కొత్త ఆవిష్కరణలు ఉత్పన్నమవుతాయని కర్నూలు ఐఐఐటీడీఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగరాజు అన్నారు. 'ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్‌లో ఆవిష్కరణలు' అనే అంశంపై మంగళవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. మూడు రోజులపాటు జరిగే ఈసదస్సును ఐఈఈఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ అధునాతన సాంకేతికతను అలవర్చుకోవడానికి ఈ సదస్సులు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ సదస్సుకు తునిస్క దేశం నుంచి లీడ్ డాటా సైంటిస్ట్ ఆలచాల్‌ఘాయ్, తమిళనాడు నుంచి డాక్టర్ రవిఈశ్వర్ వర్చువల్‌గా పాల్గొని విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, సదస్సు కౌన్సిలర్ డాక్టర్ నరసింహులు, కోఆర్డినేటర్ డాక్టర్ లెనిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

'టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా'

బండిఆత్మకూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న కుటుంబానికి భరోసా ఉంటుందని ఆ పార్టీ నాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదు చేశారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ వంద రూపాయలతో సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. చాకలి వెంకటయ్య అనే వ్యక్తి అనారగ్యంతో బాధపడుతుండడంతో వైద్యం కోసం మదుసూధన్‌రెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో శంకర్, హేమసుందర్‌రెడ్డి, హరిబాబు, స్టాలిన్‌రాజు, కుమార్ పాల్గొన్నారు.

'పంట సస్యరక్షణతోనే అధిక దిగుబడి'

మిడుతూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పంట సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పీరు నాయక్ అన్నారు. మండలంలోని చెరుకుచెర్ల, తిమ్మాపురం గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో రైతులతో మాట్లాడుతూ శనగ పంటలో లద్దె పురుగు నివారణ కోసం సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని సూచించారు. శనగ విత్తనం విత్తినప్పటి నుంచి 25 రోజుల వరకు గుడ్ల సముదాయాన్ని ఏరి నాశనం చేయాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు మద్దిలేటి, వెంకటేశ్వర్లు, ఏఈవో అశోక్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్ (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పని సరిగా పంట వేసే సమయంలో భూసార పరీక్షలు నిర్వహించుకుని వాటి ఫలితాలకు అనుగుణంగా ఎరువులను వాడాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం బాపనంతాపురం గ్రామంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో రైతులు పండించిన కంది, మినుము పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పట్టు పరిశ్రమశాఖ అధికారి అరుణ, వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్, ఎంపీఈవోలు ముర్తుజావలి, రవిగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

'బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు'

వెలుగోడు డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని ఎస్ఐ విష్ణునారయణ హెచ్చరించారు. మంగళవారం బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న వారిని డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి రెండు కేసులు నమోదు చేశామని తెలిపారు. ఏఎస్ఐ షాషావలి, సిబ్బంది చెంచయ్య, లక్ష్మనాయక్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ

వెలుగోడు డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంలోని లిటిల్ ఏంజిల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించారు. ఈ నెల 14, 15న ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో 27వ అఖిల భారతీయ తైక్వాండో పోటీలలో ఈ విద్యార్థులు పాల్గొని విజయం సాధించారు. అండర్ 14 విభాగంలో నాగ జశ్వంతరెడ్డి బంగారు పతకాన్ని, అండర్ 16 విభాగంలో ఇర్ఫాన్ కాంస్య పతకాన్ని, అండర్-12 విభాగంలో తేజస్‌గౌడ్ కాంస్య పతకం, అండర్-13 విభాగంలో రాజవివేక్ బంగారు పథకాన్ని సాధించారు. అలాగే డీఫౌలు పాఠశాలకు చెందిన సాయిచరణ్ అండర్-12 విభాగంలో కాంస్య పతకం సాధించాడు. పాఠశాల నిర్వాహకులు వీరికి ఘన స్వాగతం పలికి సన్మానించారు. అలాగే వీరికి శిక్షణ ఇచ్చిన మాస్టార్ జయచంద్ర గౌడ్‌ను పాఠశాల నిర్వాహకులు ఇమ్మానియేలు, ఉపాధ్యాయులు అబినందించారు.

మొసలిని బంధించిన అటవీ అధికారులు

పాములపాడు డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా మండలంలోని కెసికెనాల్, తెలుగుగంగ సమీప గ్రామాల ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన మొసలిని ఎట్టకేలకు మంగళవారం వెలుగోడు అటవీశాఖ అధికారి ఖాన్ ఆధ్వర్యంలో బంధించారు. పాములపాడు మండలంలోని బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ వద్ద కెసికెనాల్ లో మొసలి సంచరిస్తున్నట్లు మత్స్యకారులు, గొర్ల కాపరులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో గత నాలుగు రోజులుగా మొసలి కదలికలను గమనిస్తూ కెనాల్‌లో నీటి ప్రవాహాన్ని తగ్గించారు. దీంతో మొసలి ఆచూకీ లభించడంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి చాకచక్యంగా బందించారు అటవీశాఖ అధికారి ఖాన్ మాట్లాడుతూ ఈ ప్రాంత గ్రామస్థులు ప్రాణ భయం ఉందని ఆత్మకూరు డిఎఫ్‌వో గారికి ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ అపరేషన్ చేపట్టి మొసలిని బందించామని తెలిపారు. మగ్గర్ జాతికి చెందిన దాదాపు మూడువందల కేజీల బరువు గల ఈ మొసలని అతికష్టం మీద పట్టుకొని ఒడ్డుకు చేర్చారు. అలాగే దీనికి నివాస యోగ్యమైన, సురక్షితమైన ప్రదేశంలో వదిలి వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు పరిశీలన

పాములపాడు డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాములపాడులో సీసీ రోడ్ల పనులను పంచాయతీరాజ్ డీఈ ధనిబాబు పరిశీలించారు. మంగళవారం పీఆర్ జేఈ రాఘవేంద్ర ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. డీఈ సీసీ రోడ్ల నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, లేదంటే బిల్లులు నిలిపి వేస్తామని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నబీరసూల్, మల్లికార్జున, మద్దిలేటి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరు రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని సిద్ధాపురం గ్రామ శివార్లలో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సిఐ కిషోర్ కుమార్ మంగళవారం తెలిపారు. గ్రామశివార్లలోని అటవీప్రాంతంలో సోదాలు నిర్వహించామని, ఈ దాడుల్లో భాగంగా ఆ గ్రామ శివార్లలోని ఆవుల బరక సమీపంలో ఓ నాటుసారా స్థావరాన్ని గుర్తించి బట్టి వద్ద ఉన్న 700 లీటర్ల బెల్లపు ఊటను, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై లు వీరస్వామి, జగదీష్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

కొలిమిగుండ్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవగాహన సదస్సులు, తనిఖీలు నిర్వహిస్తున్న ట్లు సీఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం కొలిమిగుండ్లలో ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లకు, ప్రయాణికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధాన రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి, కేసులు నమోదు చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, మహిళా కూలీలను తరలించే ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

సామాజిక తనిఖీలపై గ్రామ సభలు

చాగలమర్రి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగలమర్రి, బ్రాహ్మణపల్లె, రాంపల్లె, ముత్యాలపాడు, మల్లేవేముల, చిన్నబోదనం గ్రామాలలో 2023-24 ఆర్థికసంవత్సరానికి సంబంధించి చేపట్టిన ఉపాధిహామీ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీలపై డీఆర్పీ జ్ఞానేశ్వర్‌రెడ్డి గ్రామసభలు మంగళవారం నిర్వహించారు. డీఆర్పీ జ్ఞానేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చాగలమర్రిలో 513 పనులకు రూ.89.92 లక్షలు, పీఆర్ 11 పనులకు రూ.29.73 లక్షలు, ఆర్‌డబ్ల్యూఎస్ 4 పనులకు రూ.52.48 లక్షలు, బ్రాహ్మణపల్లెలో 23 పనులకు రూ.16.21 లక్షలు, ముత్యాలపాడులో 268 పనులకు రూ.126.40 లక్షలు, పీఆర్ 6 పనులకు రూ.20.78 లక్షలు, చిన్నబోదనం 45 పనులకు రూ.23.49 లక్షలు, ఎద్దబోదనం 71 పనులకు రూ.33.15 లక్షలు ఉపాధి నిధులతో పనులను చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి చేపట్టిన ఉపాధి పనులపై విచారణ చేపట్టారు. ఆయా పనులలో అవకతవకలకు పాల్పడినట్లు టీడీపీ నాయకులు ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్పీ మురీద్, ఈవో తాహిర్‌హుసేన్, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, ఏపీవో నిర్మల, డీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల సుస్థిరాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో సుస్థిరాభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని నంద్యాల డీఎల్పీవో రాంబాబు తెలిపారు. మండలపరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ శిక్షణలో డీఎల్పీవో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఎంఈవో అనూరాధ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వరుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య సహాయకులు, సంక్షేమ సహాయకులు, జీఎంఎస్‌కేలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు


ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కోవెలకుంట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బనగానపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నాయకులు బాలయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు పండ్లు, బ్రెడ్లు అందించారు. కార్యక్రమంలో బాలన్న, ఓబులేసు, సత్యం, శ్రీను, రమేశ్, పాపన్న, బాలయ్య, రామచంద్రుడు, మోహన్‌రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల శ్రమ వెలకట్టలేనిది



కార్మికులకు దుస్తులు అందిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిత్యం పట్టణ పరిశుభ్రత కోసం శ్రమిస్తూ మురికి వాడలను శుభ్రపరిచి, ప్రజల ఆరోగ్యం కోసం శ్రమించే పంచాయతీ కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని టీడీపీ మహిళా నేత బీసీ ఇందిరమ్మ పేర్కొన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణానికి చెందిన 121మంది పారిశుధ్య కార్మికులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో సతీష్ కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

కొలిమిగుండ్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మలపెంట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఉలువల నరసింహులు కుటుంబాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరారెడ్డి మంగళవారం పరామర్శించారు. నరసింహులు తల్లిఎరికలమ్మ మృతి చెందడంతో తుమ్మలపెంట గ్రామానికి చేరుకొని నివాళి అర్పించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో అమర్‌నాథరెడ్డి, బాలదస్తగిరిరెడ్డి, ఉలువల నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.25వేల విరాళం


నందవరం ఆలయాభివృద్ధికి విరాళం అందిస్తున్న దాతలు

బనగానపల్లె , డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి నంద్యాలకు చెందిన హేమ వినీష వారి కుటుంబ సభ్యులు ఆలయాభివృద్ధికి శుక్రవారం విరాళం అందించారు. రూ.25వేల విరాళాన్ని ఆలయ ఈవో కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డిలకు అందించారు. కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

మీ ఇల్లే విద్యుదుత్పత్తి కేంద్రం


చాగలమర్రిలో వినియోగదారుడు ఏర్పాటు చేసిన సోలార్

- కేంద్ర ప్రభుత్వ రాయితీతో సౌర విద్యుత్ సులభతరం
- ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనతో తగ్గనున్న బిల్లుల భారం
- గృహ వినియోగదారులకు మాత్రమే వర్తింపు

చాగలమర్రి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) :

సౌర విద్యుత్ వెలుగులు గ్రామాల్లో నింపాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా సోలార్ రూఫ్‌టాప్‌లను రాయితీతో అందించనుంది. ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్‌లను అమర్చుకోవడం ద్వారా వినియోగదారుడు తమకు కావాల్సిన కరెంట్‌ను వాడుకొని, మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించవచ్చు. వినియోగదారుడే ఉత్పత్తిదారుడిగా మారే అవకాశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పథకాన్ని గృహోపయోగానికి వర్తింపజేస్తున్నారు. పథకం కింద లబ్ధిపొంది నెలవారీ విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవచ్చు.

ఒక కిలో వాట్ సామర్థ్యంగల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్లు విద్యుదుత్పత్తి అవుతుంది. వినియోగదారుడికి ప్రస్తుతం వస్తున్న బిల్లు రూ.1,000 అయితే సోలార్ ఏర్పాటు తరువాత వచ్చే బిల్లు రూ.338 మాత్రమే. ఏడాదికి రూ.8 వేలు ఆదా అవుతుందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. ఇంటి పైకప్పుపై కనీసం 10 చ.మీ లేదా 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కేవీపీ సామార్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చు. రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 240 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 240 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. దీని ద్వారా నెలకు రూ.2 వేలు విద్యుత్ బిల్లు వచ్చే వినియోగదారుడికి రూ.333 మాత్రమే వచ్చే అవకాశం ఉంటుంది. ఏడాదికి రూ.20 వేలు ఆదా అవుతుంది.


గృహంలో ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్


ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ దృశ్యం

● నమోదు చేసుకోవడమిలా..

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో పేర్లు నమోదు చేసుకునేందుకు యాప్‌లో, ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో వెండర్ల (కాంట్రాక్టర్లు) వివరాలు ఉంటాయి. పేరు నమోదు చేసుకున్న తరువాత తమకు నచ్చిన వారిని ఎంచుకోవచ్చు. తమ ఇంటికి ఎన్ని కిలోవాట్ల విద్యుత్ అవసరమో ఎంచుకునే నమోదు చేసుకోవాలి. ఒకటి, రెండు, మూడు కిలోవాట్ల వరకు వర్తింపజేస్తారు.

● మిగులు విద్యుత్‌కు నగదు చెల్లింపు

ఇళ్లపై బిగించిన సోలార్ రూఫ్‌టాప్‌ల ద్వారా విద్యుదుత్పత్తి అవుతుంది. అక్కడి నుంచి తిరిగి ఇళ్ల సర్వీస్ తీగల నుంచి ఇంటి అవసరాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. విద్యుత్ సరఫరా, వినియోగం ఎంతమేర అనేది సోలార్ యూనిట్ ద్వారా అమర్చిన ప్రత్యేక మీటర్‌లో నమోదు అవుతుంది. సౌర ఫలకల ద్వారా ఒక ఇంటి నుంచి ఎంతమేర విద్యుదుత్పత్తి అయింది. ఎంత వినియోగించారు, మిగులు విద్యుత్ ఎంత అనే లెక్కలు మీటర్‌లో నమోదవుతాయి. మిగులు ఉంటే విద్యుత్‌శాఖ అధికారులు ఆరు నెలలకు ఒక సారి లెక్కించి యూనిట్‌కు ప్రస్తుత మార్కెట్‌ధర రూ.2.90 చొప్పున చెల్లిస్తారు. మూడు కిలో వాట్ల సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయడానికి రూ.1.45 లక్షలు ఖర్చు అవుతుంది. రూ.78 వేలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. ఒక కిలో వాట్ నుంచి పది కిలో వాట్ల వరకు సోలార్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామాన్ని రాష్ట్ర ప్రభుత్వం సూర్యఘర్ యోజన కింద పైలెట్‌గా ఎంపిక చేశారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకే ప్రయోగాత్మకంగా ఈ గ్రామాన్ని ఎంపిక చేశారు.



విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుంది



ఇళ్లపై బిగించిన సోలార్ రూఫ్‌టాప్‌ఎల ద్వార విద్యుత్ బిల్లు భారం తగ్గుతుంది. రూ.2.10 లక్షలు ఖర్చు చేసి సోలార్‌రూఫ్‌టాప్‌ను నిర్మించుకున్నా. రూ.75 వేలు సబ్సిడీ వచ్చింది. బ్యాంకు ద్వారా సబ్సిడీ పొందవచ్చు. విద్యుత్ మీటర్ వల్ల రూ.1,000 బిల్లు వచ్చింది. సోలార్‌రూఫ్‌టాప్ ద్వారా బిల్లు రూ.100 వచ్చింది. సూర్యఘర్ యోజన వినియోగదారులకు విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుంది.

– ఫరూక్, వినియోగదారుడు, చాగలమర్రి

వినియోగదారుడే ఉత్పత్తిదారుడు

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వార గృహ వినియోగదారుడు విద్యుత్ ఉత్పత్తిదారుడుగా మారే అవకాశం ఉంది. అధిక ప్రయోజనాలు కలిగిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రూ.78 వేలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. విద్యుత్ కనెక్షన్ దరఖాస్తుదారుడి పేరుమీదనే ఉండాలి.

– షాజహాన్, విద్యుత్ ఏఈ, చాగలమర్రి

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

● డీఎస్పీ శ్రీనివాసులు


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని డోన్ డీఎస్పీ పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పెన్షనర్ల కార్యాలయంలో పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ విధుల నిర్వహణలో ఉద్యోగులు ప్రజలకు మేలు చేకూర్చే పనులు చేసి మన్ననలు పొందాలన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో డోన్ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాల్లో ఒక ప్రాణం కూడా పోకూడదన్న లక్ష్యంతో ట్రాఫిక్ నియంత్రణకు దృష్టి పెట్టి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పెన్షనర్లకు శాలువలు, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో శతావధాని దత్తాత్రేయ శర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, కమిషనర్ ప్రసాద్‌గౌడు, సబ్ ట్రెజరర్ అధికారి రఘునందన్, మండల విద్యాధికారి ప్రభాకర్, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కేఎస్ భానుసింగ్, కార్యదర్శి గాలయ్య, అసోసియేట్ అధ్యక్షులు సుబ్బరాయుడు, సంఘం నాయకులు గోపాల్, లోకనాథరెడ్డి, దాసప్ప, రామదాసురెడ్డి ఉన్నారు.


చాగలమర్రిలో నకరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో మంగళవారం విశ్రాంత ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన ఘనంగా పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీకే నకరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 75 సంవత్సరాలు పైబడిన పెన్షనర్లు అంజనమ్మ, శాంతాబాయి, పక్రుద్దీన్, సీపీ నరసింహులుతో పాటు డిజిటల్ సహాయ సహకారాలు అందించిన ప్రేమకుమార్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, కోశాధికారి రంగయ్య, కమిటీ సభ్యులు అన్నా సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, విజయరాజు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్


ప్యాపిలి రెవెన్యూ సదస్సులో వినతులు అందజేస్తున్న రైతులు

ప్యాపిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో అన్ని భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యు సదస్సులో తహసీల్దారు బారతితో కలిసి ఆయన పాల్గొన్నారు. నాగేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ రీ సర్వే పేరుతో గత వైసీపీ ప్రభుత్వం రైతుల మధ్య భూ వివాదాలు సృష్టించిందన్నారు. వివాదాలకు సంబంధించి వినతులు అందజేస్తే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అధికారులు న్యాయం చేస్తారన్నారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రామస్తులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. అలాగే వివిధ భూసమస్యలు పరిష్కరించాలని రైతులు వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుజాత, వీఆర్వో సూరిబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: గ్రామాల్లోని రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ ప్రకాష్‌బాబు తెలిపారు. మంగళవారం పట్టణంలోని 3వ సచివాలయంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ హేమంత్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకురాలు ప్రసన్నలక్ష్మి, టీడీపీ నాయకులు కేవీ సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండల పరిధిలోనిగుల్లదుర్తి గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దారు పవన్‌మార్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, మండల సర్వేయరు వీరన్న, వీఆర్వో లక్షుమయ్య, రైతులు పాల్గొన్నారు.

రుద్రవవరం: మండలంలోని చిలకలూరు గ్రామంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 4 దరఖాస్తులు వచ్చాయని డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖరయ్య తెలిపారు.

చాగలమర్రి: మండలంలోని రాజోలి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, మండల సర్వేయర్ మద్దిలేటి, వీఆర్వోలు పెన్నం ప్రసాద్, పద్మశేఖర్, సుబ్బరాయుడు, సర్వేయర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

డోన్ రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామంలోని సచివాలయం ప్రాంగణంలో గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. వెంకటాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని గుమ్మకొండ, అబిరెడ్డిపల్లె, మల్లెంపల్లె గ్రామ రైతులు రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో డోన్ మండల తహసీల్దార్ నాగమణి, మండల సర్వేయర్ జగదీష్, ఆర్‌ఐ మస్తాన్ పాల్గొన్నారు.


బేతంచెర్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రకాష్‌బాబు


రెవెన్యూ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ కలెక్టర్


డోన్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమణి



రాజోలిలో ర్యాలీ చేస్తున్న అధికారులు

సంజామల: మండల రైతులకు సత్వర సేవలు అందించాలని డిప్యూటీ కలెక్టర్ రాంభూపాల్ రెడ్డి రెవెన్యూ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సంజామలలో జరిగిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భూ సమస్యలు, కొలతలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వేగవంతంగా పనులు చేయాలని ఆదేశించారు. ప్రధానంగా రీ సర్వే జరిగిన గ్రామాల్లో భూ సమస్యలు అధికమయ్యాయని తహసీల్దార్ డిప్యూటీ కలెక్టర్‌కు తెలియజేశారు. రీ సర్వేకు సంబంధించి క్షున్నంగా పరిశీలించి ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్ మల్లేశ్వరీ, క్రిష్ణయ్య, వీఆర్వోలు సుబ్బరాయుడు, గుర్రప్ప, ఎరుకలయ్య తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలతో అధిక దిగుబడులు సాధించండి


మాట్లాడుతున్న నాగరాజు

కోవెలకుంట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పండ్ల తోటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఉద్యానశాఖ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు పండ్ల తోటల సాగు కోసం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఒక్కో హెక్టారుకు మామిడికి 13500, జామ 29335, డ్రాగన్‌ఫ్రూట్స్ 50వేలు, అల్లనేరేడుకు 30వేలు, చీనీతోటలకు 16వేలు, మల్చింగ్ పేపరు 16వేలు, హైబ్రిడ్ కూరగాయలు 20వేలు, మిరప ఐసీఎల్ 12వేలు, పూలతోట సాగుకు 16వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోవెలకుంట్ల హార్టికల్చర్ అధికారి ధరణి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణకు కృషి చేయాలి

చాగలమర్రి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాతా శిశుసంరక్షణకు వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు కృషి చేయాలని జిల్లా నోడల్ అధికారి జగదీష్‌చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు అంజలి నుంచి డీడీవో ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నారు. ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో కాన్పులు జరిగేలా చూడాలని అన్నారు. ప్రతి గర్భిణి వివరాలను నమోదు చేయాలని అన్నారు. గత నెల 14 నుంచి నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారికి బీసీజీ టీకాలు తప్పనిసరిగా వేయించాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు అంజలి, సుల్తాన, సీహెచ్‌వో రమణమ్మ, హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

‘రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం’


శిరివెళ్ల: ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న అధ్యక్ష, ఉపాధ్యక్షులు

చాగలమర్రి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీజీపీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ శజ్జారెడ్డి తెలిపారు. మంగళవారం 8వ టీజీపీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. టీజీపీ డీఈ వెంకటరమణ డిక్లరేషన్ పత్రాన్ని ఆమెకు అందజేశారు. వైస్ ప్రెసిడెంట్‌గా సంజీవరెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చైర్మన్ పదవికి ఎంపిక చేసినందుకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, భార్గవ్‌రామ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణారెడ్డి, టీజీపీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

రుద్రవవరం: తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఈఈలు శివ శంకర్ రెడ్డి, రఘురామిరెడ్డిలు తెలిపారు. 5వ డిస్ట్రిబ్యూటర్ కమిటీకి చైర్మెన్‌గా శివ క్రిష్ణ, వైస్ చైర్మన్ పెద్దపల్లె నరసింహారెడ్డి, 6వ డిస్ట్రిబ్యూటర్ చైర్మన్‌గా నగిలి నిర్మలాదేవి, వైస్ చైర్మెన్‌గా మొల్ల రజాక్‌లను ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్. వి. రంగనాయకులు, డీఈలు చంద్ర ఓబుల్‌రెడ్డి, వెంకట రామిరెడ్డిలు పాల్గొన్నారు.

● మండల పరిధిలోని తెలుగుగంగ ఉప కాలువ అభివృద్ధికి కృషి చేస్తామని 5వ చైర్మన్ శివ క్రిష్ణ, 6వ చైర్మన్‌సగిలి నిర్మలా దేవి, వైస్ చైర్మన్ ముల్లా రజాక్, పెద్దపల్లె నరసింహారెడ్డి అన్నారు. కార్యక్రమంలో తెలుగు టీసీ చైర్మన్ చం ద్ర శేఖర్, టీడీపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, యడవల్లి శ్రీనివాసులు, రామనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: రైతుల అభివృద్ధికి అన్ని విధాలా తమ వంతు కృషి చేస్తామని నీటి సంఘం డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులు బబ్బూరి వెంకటస్వామి, ఏరువ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా మండల కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. డీసీ-7 కేసీ కెనాల్ అధ్యక్షుడిగా ఏరువ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా లింగుట్ల వెంకట్‌నాయుడు, డీసీ-8 అధ్యక్షుడిగా బబ్బూరి వెంకటస్వామి, ఉపాధ్యక్షుడిగా కుందూరి రామిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను నాయకులు సిద్ధిసత్యం, కొత్తపల్లి సురేంద్ర, మహేశ్వర్‌రెడ్డి, రమణయ్య, శ్రీనివానివాసులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీలర్ రమణయ్య, నాయనగారి అచ్చమ్మ, కోనయ్యగారి శ్రీను పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటరీ-4 అధ్యక్షుడిగా సంజీవ కుమార్‌రెడ్డి

శిరివెళ్ల: సాగునీటి సంఘం ఎన్నికల్లో భాగంగా తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ-4 కమిటీ అధ్యక్షుడిగా శిరివెళ్ల మండలం గంగవరం గ్రామానికి చెందిన చెన్నారెడ్డిగారి సంజీవ కుమార్‌రెడ్డి(డబ్ల్యూయూఏ-21), ఉపాధ్యక్షుడిగా మహదేవపురం గ్రామానికి చెం దిన కలాటి నాగయ్య(డబ్ల్యూయూఏ-25) లను మంగళవారం ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. డబ్ల్యూయూఏ-20 నుంచి డబ్ల్యూయూఏ-25 వరకు ఉన్న ఆరుగురు సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను అధికారుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి ఎన్నికల నిర్వహణ అధికారి ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, నాయకులు చెన్నారెడ్డిగారి జనార్దన్‌రెడ్డి, వెలుగోడు మహేష్ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: ఎస్‌ఆర్‌బీసీ పంట కాల్వలను అభివృద్ధి చేసి రైతులకు అన్ని విధాలా సేవలందిస్తామని వల్లంపాడుకు చెందిన నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం డిస్ట్రిబ్యూటరు కమిటీ నందవరం ఉపాధ్యక్షుడుగా బి.నారాయణరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నంద్యాల ఎస్‌ఆర్‌బీసీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇజంజనీరు ఆధ్వర్యంలో మంగళవారం డిక్లరేషన్ అందుకున్నారు. ఎస్‌ఆర్‌బీసీ నాలుగో డిస్ట్రిబ్యూటరు కమిటి ఉపాధ్యక్షులుగా బిజినవేములకు చెందిన టీడీపీ నాయకుడు అవుకు రాధాక్రిష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


రుద్రవరంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లకు డిక్లరేషన్ పత్రాలను అందజేస్తున్న అధికారులు


ఎస్సార్బీసీ డీసీ రఘునాథరెడ్డిని సత్కరిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె: బనగానపల్లె మండలం ఎస్సార్బీసీ సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా కైప గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మొదుళ్ల రఘునాథరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా రాధాకృష్ణమూర్తి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బనగానపల్లె మండల స్పెషల్ అధికారి సుబ్బారెడ్డి చేతుల మీదుగా డిక్లరేషన్‌ఫారం కైప రఘునాథరెడ్డి అందుకున్నారు.

ఎస్సార్బీసీ కాల్వల అభివృద్ధికి కృషి చేయాలి : బీసీ రాజారెడ్డి

బనగానపల్లె మండలం ఎస్సార్బీసీ సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ 4 అధ్యక్షుడిగా కైప గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రఘునాథరెడ్డిని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజరెడ్డి, టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మలు మంగళవారం అభినందించారు. డిస్ట్రిబ్యూటరీచైర్మన్‌గా ఎన్నికైన రఘునాథరెడ్డి బీసీ రాజారెడ్డి, బీసీ ఇందిరమ్మను మర్యాద పూర్వకంగా కలిశారు. బీసీ రాజారెడ్డి, బీసీ ఇందిరమ్మలు రఘునాథరెడ్డిని అభినందించారు. కాల్వల అభివృద్ధికి కృషి చేసి రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఎస్సార్బీసీ కాల్వల అభివృద్ధికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిపూర్తి స్థాయిలో సహకరిస్తారన్నారు.